



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 సంచిక : 170 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 1 మార్చి 2025 పేజీలు : 12 వెల : 2/-


## మెటాలో సంచలనం.. డేటా లీక్!!




**వాషింగ్టన్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో దూసుకుపోతున్న మెటాలో సంచలనం చోటు చేసుకుంది. కీలకమైన అంతర్గత డేటా మీడియాకు లీకైంది. దీంతో ఇక్కసారిగా సంస్థలో ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. ఈ డేటాలో అత్యంత రహస్యమైన సమాచారం కూడా ఉందని సందేహిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే.. మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా సమాచారాన్ని మీడియాకు లీక్ చేసిన ఉద్యోగులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో ఇప్పటికే 20 మందికిపైగా ఉద్యోగాల నుంచి తక్షణం మిగతా 2

## ప్రశాంత్ కిశోర్‌కి ఎమ్మెల్యేగా గెలిచే సత్తా ఉందా. ?



**బీహార్ :** శకునాలు చెప్పే బల్లి కుడితెలో పడిందని ఒక ముతక సామెత. ఎన్నికల వ్యూహకర్త రాజకీయ పార్టీ అధినేతగా కొత్త అవతారం ఎత్తిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే పరిస్థితి కూడా అలాగే ఉందా అన్న దాని మీద పొలిటికల్ గా సెటైర్లు పడుతున్నాయి. పీకే జన సూరజ్ అని ఒక పార్టీ పెట్టారు. ఆ పార్టీ బీహార్ లో ఏమీ పెద్దగా రాజకీయ ప్రదర్శన చేసింది లేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో సంచలనాలు సృష్టిస్తామని చెబుతోంది. అంతే కాదు బీహార్ సీఎం నితీష్ కుమార్ ని మాజీ సీఎం అవుతారని పీకే జోస్యం చెబుతున్నారు. నిజానికి చూస్తే మిగతా 2



## కూటమి ప్రభుత్వం సూపర్స్ సిక్స్‌లో

# సగం పాసైనట్లేనా?

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా.. రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ ను తీసుకొచ్చారు. ఈ సమయంలో ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులపై ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూశారని అంటున్నారు. ఈ సమయంలో సూపర్ సిక్స్ పథకాల్లో కూటమి ప్రభుత్వం ఏ మేరకు పాస్ అయ్యిందనేది ఆసక్తిగా మారింది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలకు కేటాయించిన నిధులపై తీవ్ర చర్చ మొదలైంది. దీనిపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పించడం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మిగతా 2

## దక్షిణాది రాష్ట్రాల ఐక్య కూటమి



**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దరామయ్య సంచలన పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాల పాలక పార్టీలు ఐక్యంగా కూటమి కట్టాల్సిన అవసరం ఉందని ఆయన తేల్చి చెప్పారు. ఐక్య వేదికగా ఏర్పడి.. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం లోని బీజేపీ కూటమి ప్రభుత్వం చేస్తున్నకుట్రలను సంయుక్తంగా ఎదుర్కొనాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో అవసరమైతే.. తానే ముందుండి మిగతా 2

## మీరు మారాలి.. మళ్లీ సభకు రావాలి

### చంద్రబాబు సీరియస్ కామెంట్స్




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** టీడీపీ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అసెంబ్లీకి రావాలి అంటే మీరు మారాలి.. పనితీరు మార్చుకోవాలంటూ సూచించారు. బడ్జెట్ పై టీడీఎల్పీ సమావేశం నిర్వహించిన చంద్రబాబు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. ఆర్థికంగా ఎన్నో సమస్యలు ఉన్నా మంచి బడ్జెట్ ను తీసుకువచ్చామని.. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ఎంపీలు, మిగతా 2

## తెలంగాణను మించి

### 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీలోని కూటమి ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యంతో ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించింది. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి, పెట్టుబడులకు గమ్య స్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ను ప్రవేశ పెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి వ్యవసాయ రంగం కీలకమని భావించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని ప్రాథమిక రంగంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించారు. 48 వేల కోట్ల రూపా యలతో వ్యవసాయ బడ్జెట్‌ను మిగతా 2

## జగన్ డౌట్ కరెక్టేనా...ఆ ఎమ్మెల్యే జంపేనా ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసీపీలో కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ మారుతారు అని జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ ప్రచారం నిజమా కాదా అన్న చర్చ కూడా ఉంది. అయితే ఏపీలో రాజకీయం చూస్తే ఏమి జరిగినా ఆశ్చర్యం అయితే లేదు అని అంటున్నారు. ఎందుకంటే ఈ ఫిరాయింపులు కొత్తేమీ కాదు. పైగా ఓడిన పార్టీని మరింతగా బలహీనం చేసేందుకు అధికార పక్షం ఎత్తులు వేయడం సహజం. ఇక అయిదేళ్ళ పాటు అధికార పక్షం నుంచి ఇబ్బందులను తట్టుకోలేని వాతావరణం కూడా వర్తమాన రాజకీయాల్లో ఉంటోంది. ఈ క్రమంలో ఏమైనా జరగవచ్చు. ఇవ్వన్నీ పక్కన పెడితే జగన్ ఇటీవల నిర్వహించిన వైసీపీ శాసనసభా పక్ష సమావేశంలో ఒక వైసీపీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పుకోలేదని ప్రశ్నించినట్లుగా ప్రచారం మిగతా 2

## ఉగాదికే ముహూర్తం

### కొత్త ఏడాదిలో మెగా బ్రదర్‌కి పదవీయోగం?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** మెగా బ్రదర్ నాగబాబుకు గ్రహాలు అను కూలంగా కనిపిస్తున్నాయి. ఈ తెలుగు సంవత్సరాదికి ఆయన మంత్రి అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు నాగబాబును మంత్రివర్గంలో చేర్చుకునేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారంటున్నారు. ఈ ఉగాదికి మంత్రివర్గాన్ని విస్తరించి నాగబాబుకి ఇచ్చిన హామీని నెరవేరుస్తారని టాక్ వినిపిస్తోంది. మెగా బ్రదర్ నాగబాబు ప్రస్తుతం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. చట్టసభలో అడుగుపెట్టాలనే ఆయన కోరిక ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. ఎన్నికల సమయంలో అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీచేసి లోక్ సభలో అడుగుపెట్టాలని భావించిన నాగబాబు ఆశలకు బీజేపీ గండికొట్టింది. పొత్తుల్లో భాగంగా అనకాపల్లిని బీజేపీకి కేటాయించడంతో మిగతా 2



### పేదలకు కూటమి సర్కార్

## ఆరోగ్య వరం!

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీలో పేదలకు మధ్యతరగతి వర్గాలకు ఆరోగ్యవరాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చింది. 2025-2026 వార్షిక బడ్జెట్ లో ఏకంగా పాతిక లక్షల రూపాయల ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయబోతున్నారు. ఇది నిజంగా మంచి పథకంగా చూడాల్సి ఉంది. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికీ నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు పాతిక లక్షల రూపాయలతో ఈ ఆరోగ్య బీమా పథకం అమలులోకి తెస్తామని ఆర్థిక మిగతా 2

### ఏపీ బడ్జెట్‌పై షర్మిల

## యతిప్రాసల రియాక్షన్!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీ అసెంబ్లీలో 2025-26 వార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా.. రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. దీంతో.. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టినట్ల య్యింది. ఈ సమయంలో బడ్జెట్ లో కేటాయింపులపై షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. అవును... రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు.. మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు.. రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు.. ఇక, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేస్తూ నేడు అసెంబ్లీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదనే చర్చ తెరపైకి వచ్చింది. ఈ సమయంలో షర్మిల స్పందించారు. ఇందులో భాగంగా... కూటమి ప్రభుత్వం తొలి పూర్తిస్థాయి బడ్జెట్.. సంఖ్య ఘనం - కేటాయింపులు శూన్యం అన్నట్లుగా ఉందని.. అంతా అంకెల గారడి - అభూత కల్పన అని.. దశ - దిశ లేని, పస లేనిదని షర్మిల విమర్శించారు. ఈ సందర్భంగా... సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారని.. ఎన్నికల వాగ్ధానాలను పూర్తిగా విస్మరించారని షర్మిల ఫైరయ్యారు. ఈ సందర్భంగా.. ఇది మంచి ప్రభుత్వం కాదు మిగతా 2

## టీడీపీ కూటమికి టీడీపీ మీడియానే వ్యతిరేకమా?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** మీడియాకి రాజకీయానికి మధ్య సన్నని గీత చెరిగిపోయింది. ప్రస్తుత రోజుల్లో మీడియాను రాజకీయాలను కలిపే చూస్తున్నారు. మరీ ముఖ్యంగా చెప్పాలంటే ప్రతి పార్టీకి ఏదో ఒక మీడియా సపోర్టు ఉంటూనే ఉంది. ఇక ఏపీ రాజకీయాల్లో ప్రధాన పార్టీలకు మద్దతుగా మీడియా పనిచేయడం ఎప్పటి నుంచో ఉంది. టీడీపీ అనుకూల మీడియాను ఎల్లో మీడియా అని.. వైసీపీ అనుకూల మీడియాను బ్లూ మీడియా అంటూ నిందించుకుంటుంటారు. ఎన్నికల్లో విజయం వరకు ఆయా మీడియా సంస్థలు తమ అనుకూల పార్టీల కోసం విస్తృతంగా ప్రచారం మిగతా 2

# ఎడిటర్ వాయిస్

## 'కొనుగోలు' శక్తి!

దేశంలోని వంద కోట్ల మందికిపైగా ప్రజలు వస్తు, సేవలకు వినియోగదార్లయ్యేందుకు వారికి కొనుగోలు శక్తి లేదని బ్లూమ్ వెంచర్స్ ఇటీవల వెల్లడించిన నివేదికతో అయినా మన పాలకులు కళ్లు తెరుస్తారేమో చూడాలి. 'భారత్ వెలిగిపోతోంది' అంటూ పాలకవర్గాలు పదేపదే ఊదర గొడుతుంటే అదేం లేదు మెజారిటీ భారత దేశం కునారిల్లిపోతోంది అని ప్రజానుకూల ఆర్థికవేత్తలు చెబుతూనే వున్నారు. మార్కెట్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాస్తవాలను వివరిస్తూ ప్రపంచ బడా కార్పొరేట్లకు మార్గనిర్దేశనం చేసేలాంటి బ్లూమ్‌బెర్గ్ సంస్థ నుండి ఇటువంటి నిర్ధారణలు వెల్లడయ్యాకనైనా వారికి తత్వం బోధపడుతుందా! దేశ జనాభాలోని 30 కోట్ల మంది తమ ఆహార ఖర్చులకు, అత్యవసర ఖర్చులకూ అవసరమైన డబ్బు మాత్రమే ఉంటోందని నివేదిక పేర్కొన్నది. ఇక మిగిలిన 13-14 కోట్ల మంది మాత్రమే మార్కెట్‌లో ఏవైనా సరుకులు లేదా ఖరీదైన సేవలకు వినియోగదారులుగా ఉన్నారని తేల్చి చెప్పింది. అంటే దేశ జనాభాలో దాదాపు పది శాతం మంది మాత్రమే! కాబట్టి అత్యధిక మంది ఆదాయాలు కుంగిపోయి అలా అలా దిగజారుతున్నారనీ, కొద్ది మంది మాత్రమే అధికాదాయాలతో సంపన్నులవుతున్నారని స్పష్టమవుతోంది. ఆర్థిక వృద్ధిలో ఇది ప్రగతిశీల ఆర్థికవేత్తలు వివరిస్తున్న ఇంగ్లీషు అక్షరం 'కె' నమూనాను వ్యక్తం చేస్తోంది కదా! కోవిడ్‌తో ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిన్నదనీ అయితే అది మరింత పుంజుకొని, ఇంగ్లీషు అక్షరం 'వి' నమూనాలో పైకెగుస్తుందనీ, అందుకే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ అంటూ నీతి ఆయోగ్ మొదలు ప్రధాని మోడీ వరకు గొప్పలు చెప్పారు. అది తప్పని బ్లూమ్‌బెర్గ్ వెంచర్స్ తాజా నివేదిక కూడా తేల్చి చెప్పింది. కాబట్టి ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి ఇప్పుడు కావలసింది ప్రజల కొనుగోలు శక్తి పెరగడం. అది కూడా సామాన్యులు, నిరుపేదలకు ఆదాయాలు వస్తేనే వినిమయం పెరుగుతుంది. ఎందుకంటే పేదవారికి వచ్చే ప్రతీ రూపాయినీ వారు ఖర్చు చేస్తారు. అదే సంపన్నులకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే వారు వినిమయం కోసం ఖర్చు చేస్తారు. మార్కెట్‌లో తగినంత డిమాండ్ ఉన్నప్పుడే పెట్టుబడిదారులు పెట్టుబడులతో ముందుకొస్తారు తప్ప సమ్మిట్‌లు, ప్రెజెంటేషన్లతో మాత్రమే కాదు. స్థూల వినిమయం తగ్గుతున్నప్పుడు వారు పెట్టుబడులు అదనంగా పెట్టడానికి ముందుకు రారు. దాని వలన సంక్షోభం మరింత ముదిరిపోతుంది. 1930 దశకానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్థకుడు. ఈ సంక్షోభం ముదిరితే అది పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే తిరుగుబాట్లకు దారి తీయవచ్చునని ఆయన భయపడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకో వాలంటే స్థూల డిమాండ్‌ను పెంచాల్సిందేనని, అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలని సూచించాడు. ఆనాడు మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచం ఆ దిశగా నడిచింది కూడా. అప్పుడు ముందుకొచ్చిందే శ్రేయోరాజ్య భావన కూడా! కాని ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచంలో సరిగ్గా కీన్స్ చెప్పినదానికి భిన్నమైన దిశగా జరుగుతోంది. దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి. ఇప్పుడు దేశం ముందుకెళ్లాలన్నా, ఆర్థిక వ్యవస్థ సంక్షోభం మరింత ముదరకూడదనుకున్నా ప్రజల ఆదాయాలు పెంచడం తప్పనిసరి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

## మెటాలో సంచలనం.. డేటా లీక్!!

తొలగించినట్టు జుకర్ బర్గ్ ప్రకటిం చారు. అయితే.. డేటా లీక్ అనేది ఇప్పటికిప్పుడు కాలేదని.. గత కొన్నాళ్లుగా అత్యంత రహస్యంగా దీనిని బహిరంగ పరుస్తున్నట్టు జుకర్ బర్గ్ భావిస్తున్నారు. అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌తో విభేదించిన బర్గ్ అప్పటి అధ్యక్షుడు బైడెన్‌కు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి తన సంస్థకు చెందిన రహస్య సమాచారాన్ని ఉద్యోగులే బయటకు వెల్లడిస్తున్నట్టు అనుమానించారు. దీంతో తాజాగా విచారణ చేపట్టి జుకర్ బర్గ్.. ప్రస్తుతం 20కి పైగా ఉద్యోగులను వెనువెంటనే తీసేశారు. ఇంకా ఎవరైనా ఉంటే.. వారిపైనా వేటు వేయనున్నట్టు బర్గ్ ప్రకటించారు. %--%కంపెనీ పాలసీకి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇకపై లీక్‌లు జరిగితే మరింత కఠిన చర్యలు తప్పవు%--% అని ఉద్యోగుల పర్సనల్ చాట్‌లో సంస్థ స్పష్టం చేయడం గమనార్హం. అంతేకాదు.. సంస్థ రహస్యాలను, రహస్య సమాచారాన్ని బయటకు లీక్ చేయడం, వేరే వ్యక్తులతో పంచుకోవడం.. తమ కంపెనీ విధానాలకు విరుద్ధమని పేర్కొంది. మెటా సంస్థ.. అనేక దేశాలకు సేవలు అందిస్తోంది. ఈ క్రమంలో పలు దేశాలతో చేసుకున్న ఒప్పందాలు .. పలు కంపెనీలకు అందిస్తున్న సేవల విషయంలో గోప్యత పాటిస్తుంది. ఈ క్రమంలో గత కొన్నాళ్లుగా మెటాపై విమర్శలురావడంపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే రహస్య సమాచారం బయటకు పొక్కినట్టు గుర్తించారు. అయితే ఏ రహస్య సమాచారం బయటకు పొక్కిందన్న విషయాన్ని గోప్యంగా ఉంచారు.

## ప్రశాంత్ కిశోర్‌కి ఎమ్మెల్యేగా గెలిచే సత్తా ఉందా.?

బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ చాలా కాలంగా పాలిస్తున్నారు. ఆయన 2005 నుంచి మధ్యలో కొద్ది నెలలు తప్పించి మొత్తంగా బీహార్ కి సీఎంగా పాలిస్తున్నారు. ఇంతలా సుదీర్ఘంగా బీహార్ ని పాలించిన నేత మరొకరు లేరు. ఏడున్నర పదుల వయసుకు చేరువ అవుతున్న నితీష్ ఈసారి కూడా గెలిస్తే మళ్ళీ సీఎం అవుతారని ఆయన పార్టీ జేడీయూ నేతలు చెబుతూంటారు. అయితే నితీష్ 1977 ఎమర్జెన్సీ నుంచి విద్యార్థి రాజకీయాల్లో మొదలెట్టి ఈ ఈ రోజు దాకా కొనసాగుతున్నారు. దాంతో ఆయన రాజకీయంగా విశ్రాంతి తీసుకుని కుమారుడిని వారసుడిగా ముందుకు తెస్తారు అన్న టాక్ ఒక వైపు ఉంది. మరో వైపు ఆయన కేంద్రంలోకి వెళ్తారని కూడా ఉంది. అవేవీ లేదు ఆయనే మళ్ళీ సీఎం అని జేడీయూ నేతలు బల్ల గుద్దుతున్నారు. ఈ నేపథ్యంలో నితీష్ కుమార్ వయోభారంతో ఉన్నారని ఆయన సీఎం సీటు ఎక్కేందుకు ఫిట్ గా లేరని ఒక బాంబు పేల్చారు జన సూరజ్ పార్టీ అధినేత ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే. ఆయన తాజాగా నితీష్ కుమార్ గురించి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. నితీష్ కుమార్ శారీరకంగానే కాదు మానసికంగా పూర్తిగా అలసిపోయారు అని అని అంటున్నారు. పైగా ఆయన రిటైర్ అయిపోయారు అని కూడా పీకే స్టేట్మెంట్ ఇచ్చేశారు. నితీష్ రాజకీయ పలుకుబడి మీద బలం మీద కూడా పీకే సెటైర్లు వేశారు. నితీష్ పార్టీకి ఎపుడూ బీహార్ గద్దెని ఏలేందుకు పూర్తి మెజారిటీ రాలేఅని అయిత్తే ఆయన పొత్తులతోనే సీఎం గా అలా కంటిన్యూ అయ్యారని నిందించారు. అంతే కాదు నితీష్ కుమార్ ఇప్పటికే రిటైర్ అయిపోయారని అంటున్నారు. మరి ఇది నిజమా గ్రౌండ్ లెవెల్ రియాలిటీ అలాగే ఉందా లేక పీకే సొంతంగా చేసిన సర్వేలో తేలిందా లేక పీకే ప్రత్యర్థి పార్టీ కాబట్టి ఇలా నిప్పులు చెరుగుతున్నారా అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఇవన్నీ అలా ఉంచితే పీకేకి ఎమ్మెల్యేగా తానుగా గెలిచి అసెంబ్లీకి వెళ్ళే సత్తా ఉందా అన్న చర్చ సాగుతోంది. పీకే రాజకీయ సర్వేలు జోస్యాలు ఆయనకు ఏ మాత్రం సరిపడవని ఆయనను అందలం ఎక్కించలేవని అంటున్నారు. అంతే కాదు పీకే పొలిటికల్ లీడర్ మెటీరియల్ కాదని కూడా ప్రత్యర్థులు అంటూంటారు. ఆయన గెలిచే పార్టీల తరఫున వకాల్తా పుచ్చుకుని వారిని గెలిపించిన క్రెడిట్ ని తన ఖాతాలో వేసుకుంటూంటారు అన్న విమర్శలు ఉన్నాయి. పీకే బిగ్ పొలిటికల్ లీడర్ ఇమేజ్ ని తానుగా క్రియేట్ చేసుకున్నారు తప్ప నిజానికి ఆయనకు అంత సీన్ ఉందా అన్నది పెద్ద ప్రశ్న. బీహార్ లో ఆయన పార్టీ ఈసారి ఎన్ని చోట్ల డిపాజిట్లు సాధిస్తుంది అన్నది కూడా మరో ప్రశ్న. ఇంతకీ పీకే ఒకే ఒక్కడుగా అయినా నెగ్గి అసెంబ్లీకి వస్తే ఆయన పార్టీ అక్కడికి సంచలనాలు సృష్టించినట్లే అని అంటున్నారు. నితీష్ కుమార్ వంటి వరిష్ట నేత మీద విమర్శలు చేసే ముందు పీకే తన రాజకీయ స్థాయి చూసుకోవాలి కదా అని జేడీయూ నేతలతో పాటు అంతా అంటున్నారు అంటే పీకే పొలిటికల్ గా చాలా నేర్చాల్సి ఉంది మరి.

## సగంపాసైనట్లేనా?

సూపర్ సిక్స్ హామీలు ఏమిటి.. వాటికి ఎంత నిధులు అవసరం.. ప్రభుత్వం కేటాయించింది ఎంత అనేది ఇప్పుడు చూద్దామ్..! కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మొట్ట మొదటి హామీ.. నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి అనే సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని అంటున్నారు. అయితే... ఈ బడ్జెట్ లో ఈ సూపర్ సిక్స్ ఫస్ట్ హామీకి ఒక్క రూపాయి కూడ కేటాయించలేదనే విమర్శ బలంగా వినిపిస్తుంది. ఇది కూటమికి కాస్త ఇబ్బందికరమైన విషయమే అని అంటున్నారు. ఇక సూపర్ సిక్స్ హామీల్లో రెండో హామీ అయిన "స్కూలుకు వెళ్లే ప్రతీ విద్యార్థికీ ఏడాదికి రూ.15,000 (తల్లికి వందనం) పథకానికి కూటమి ప్రభుత్వం ఈ 2025-26 విద్యా సంవత్సరానికి కేటాయింపులు చేసింది. ఇందులో భాగంగా... ఈ పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించింది. అయితే... రాష్ట్రంలో 81 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. వారికి రూ.12వేల కోట్లు అవసరమని వైసీపీ చెబుతోంది. అంటే.. ఈ పథకానికి సుమారు ఇంకా రూ.3వేల కోట్లు అవసరమనేది వైసీపీ మాట. దీంతో... సుమారు 20 లక్షల మంది విద్యార్థులను ఏమి చేద్దామనుకుంటున్నారనేది వైసీపీ ప్రశ్నగా ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తే బెటరని అంటున్నారు. లేదంటే.. పిల్లలను స్కూల్స్ కి పంపే తల్లుల్లో 20 లక్షల మంది ఆగ్రహం చవి చూడాల్సి రావొచ్చని అంటున్నారు! ఇదే సమయంలో... సూపర్ సిక్స్ హామీల్లో మూడోది అయిన "ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం (అన్నదాత సుఖీభవ)" పథకం! పేరు వేరైనా గతంలో వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద సుమారు 50 లక్షల మందికి ఆర్థిక సాయం అందించిందని చెబుతున్నారు. ఇప్పుడు వారి సంఖ్య 54 లక్షలు వరకూ ఉండోచ్చనేది అంచనా. ఆ లెక్కన చూసుకుంటే.. ఇప్పుడు ఈ పథకానికి సుమారు రూ.10,400 కోట్ల వరకూ నిధులు అవసరం కాగా.. ఈ బడ్జెట్ లో రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో... ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడంపైనా వైసీపీ నేతలు మండిపడుతున్నారు! సూపర్ సిక్స్ హామీల్లో నాలుగో హామీ విషయానికొస్తే... "ప్రతీ ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు (దీపం పథకం)"! ఈ పథకానికి ప్రభుత్వం రూ.2,601 కోట్లు కేటాయించింది. ఇది కూడా పూర్తి మొత్తం కాదనేది వైసీపీ వాదన. ఎందుకంటే... కోటీ 55 లక్షల మంది దీపం పథకానికి అర్హులైతే.. దాన్ని 95 లక్షలకు కుదించారని వైసీపీ ఆరోపిస్తుంది. ఈ నేపథ్యంలో... దీనికి 4వేల కోట్లకు పైగా నిధులు అవసరమైతే.. తాజా బడ్జెట్ లో రూ.2,601 కోట్లే కేటాయించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలనేది వారి ప్రశ్న. సూపర్ సిక్స్ హామీల్లో ఐదో హామీ విషయానికొస్తే... "ప్రతీ మహిళకు నెలకు రూ.1,500" పథకం. దీన్ని టీడీపీ నేతలు బలంగా ప్రమోట్ చేశారు కూడా! దీనికోసం ఏడాదికి సుమారు రూ.32 వేల కోట్లు అవసరం అవ్వగా.. ఈ బడ్జెట్ లో ఒక్కరూపాయి కూడా కేటాయించలేదనేది విపక్షల నుంచి బలంగా వినిపిస్తున్న విమర్శగా ఉంది. ఇక సూపర్ సిక్స్ హామీల్లో ఆరో హామీ కూడా చాలా పవర్ ఫుల్ అనే చెప్పాలి. అదే... "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం" పథకం. ఈ పథకానికి నెలకు సుమారు రూ.350 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అయితే... ఈ పథకానికి కూడా బడ్జెట్ లో కేటాయింపులు శూన్యం అనేది బలమైన విమర్శగా ఉంది. ఇది మహిళా లోకంలో కాస్త ఆగ్రహం తెప్పించే అంశమే అని అంటున్నారు. ఈ లెక్కన చూస్తే... సూపర్ సిక్స్ హామీలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు మాత్రమే (ఎంతోకొంత) నిధులు కేటాయించగా.. మిగిలిన మూడు హామీల ఊసే బడ్జెట్ లో లేకపోవడం గమనార్హం! ఈ నేపథ్యంలోనే... ఈ బడ్జెట్ విషయంలో కూటమి ప్రభుత్వం జగన్ కి దొరికేసినట్లేనా అనే చర్చ మొదలైందని అంటున్నారు. మరోపక్క.. ఆరింటిలో మూడింట పాసైనట్లే అనే కామెంట్లు వినిపిస్తున్నాయి!

## ఐక్య కూటమి

పోరాడుతానని ప్రకటించారు. అంతేకాదు, ఐక్య కూటమికి తాను నాయకత్వం వహిస్తానని చెప్పారు. ఈ కూటమి వచ్చే ఆరుమాసాల్లో భేటీ అయి. కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలన్నారు. 2026లో దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు స్థానాలను డీలిమిటేషన్ చేయనున్నారు. అంటే.. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను జనాభా ప్రాతిపదికన పెంచడమో.. తగ్గించడమో చేస్తారు. ఇది ప్రతి 15 లేదా 20 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. గతంలో 15 ఏళ్ల కిందట డీలిమిటేషన్ జరిగింది. దీంతో స్థానాలు పెరిగాయి. ఇప్పుడు 2026లో డీలిమిటేషన్ ప్రక్రియకు కేంద్రంలోని మోడీ సర్కారు శ్రీకారం చుడుతోంది. ఇదే.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో చర్చకు దారి తీసింది. ఏపీలో ఎలానూ ఎన్డీయే కూటమి సర్కారు ఉంది కాబట్టి.. దీనిపై పెద్దగా ఆందోళన లేదు. కానీ, కర్ణాటక, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ, తమిళనాడులో డీఎంకే, కేరళలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారు. దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేసే అవకాశం ఉందని.. డీలిమిటేషన్‌ను అడ్డుపెట్టి స్థానాలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నద ని వారి ఆందోళన. ఈ విషయంపై తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే ఆరోపణలు గుప్పించింది.

## మళ్లీ సభకు రావాలి

ఎమ్మెల్యేదేనని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నా మంచి బడ్జెట్ ను ప్రజలకు అందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, టీడీపీ కూటమి పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ప్రాధాన్యమిచ్చినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఈ ఏడాది నుంచి తల్లికివందనం, అన్నదాతా సుఖీభవ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మత్స్యకారుల వేట నిషేధ కాలంలో అందజేసే ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. బీసీలకు ప్రాధాన్యమివ్వడంతోపాటు వారి రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యంగా బడ్జెట్ పై కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కాలంటే ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావాలని చెప్పారు. మళ్లీ సభకు రావాలి.. అనే భావనతో ఎమ్మెల పనితీరు ఉండాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు సమన్వయంతో ఉండాలని సూచించారు. ఎక్కడా గ్రూపు తగాదాలను సహించేది లేదని హెచ్చరించారు.

## మళ్లీ సభకు రావాలి

చేశాయి. ఇక ఎన్నికల తర్వాత రూటు మార్చి తాము మద్దతు పలికిన పార్టీపైనే రివర్స్ అటాక్ చేస్తున్నాయి. ప్రధానంగా అధికార టీడీపీకి అనుకూలంగా చెప్పే టీవీ చానల్స్ లో ప్రసారమవుతున్న కథనాలు, నిర్వహిస్తున్న డిబేట్లు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండటం గమనార్హం. ఏపీలో తొమ్మిది నెలల చంద్రబాబు పాలనపై ప్రజలు ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారోగానీ ఆ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్న సోషల్ మీడియాతోపాటు మెయిన్ స్ట్రీమ్ మీడియా వ్యతిరేక కథనాలతో దుమ్ము రేపుతోంది. ముఖ్యంగా సీఎం చంద్రబాబునే టార్గెట్ చేస్తూ ఆయన వైఖరిని ప్రశ్నిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికీ ప్రతిపక్షమే అధికారం చెలాయిస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజకీయాలే తెలియవన్నట్లు టీడీపీ అనుకూల మీడియాగా భావించే చానెల్స్ ల్లో న్యూస్ ప్రసారమవడం కూటమి నేతల్లో చర్చకు దారితీస్తోంది. ఇక గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై టీడీపీ మీడియాలో ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన స్థాయిలో ఉండి కూడా ఇంకా ఆరోపణలు చేయడమేంటంటూ నిలదీస్తుండటంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. చంద్రబాబు ఏం చేయాలో ఎలా చేయాలో కూడా టీడీపీ అనుకూల మీడియా చెబుతుండటం గతంలో ఎప్పుడూ వినలేదు, చూడలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఒక ఛానల్ ఎండీ ప్రతివారం స్వయంగా రాసే కాలమ్ లో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేస్తుండటం చర్చకు తావిస్తోంది. 42 రెండేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మారానను చెబుతూనే తన పాలనలో పాత వాసనలు వదలడం లేదని, క్యాడరును నిర్లక్ష్యం చేస్తున్నారని నిందిస్తున్నారు. సొంత మీడియాలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపై ఇలాంటి విమర్శలు వస్తుండటం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతోందని అంటున్నారు. ఒకవైపు చర్యలు తీసుకోమని టార్గెట్ విధించడం, అధికారులకు గత పాలకులతో లింకులు పెట్టి ప్రభుత్వాన్ని ఒంటరిని చేసే ప్రయత్నం జరుగుతోందని అంటున్నారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాతోపాటు సోషల్ మీడియా సైతం టీడీపీ పాలనను టార్గెట్ చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల ఆ పార్టీ నేత జీవీ రెడ్డి విషయంలోనూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. జీవీ రెడ్డితో రాజీనామా చేసేంతవరకు సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రభుత్వ పరువు బజారున పడిందనే అభిప్రాయం ఆ పార్టీ సోషల్ మీడియాలో వ్యక్తమవుతోంది. ఈ ట్రోలింగ్స్, డిబేట్స్ వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సామర్థ్యాన్నే ప్రశ్నిస్తుండటం గమనార్హం.

## తెలంగాణను మించి

రూపొందించినట్టు వివరించారు. వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా వికసిత ఆంధ్ర ప్రదేశ్ అనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదేసమయంలో విజన్ 2047 సాకా రానికి కూడా కృషి చేస్తున్నట్టు చెప్పారు. గతంలో వైసీపీ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిందన్న ఆయ న.. రైతులకు కనీసం గిట్టుబాటు ధరలు కూడా రాకుండా చేసిందన్నారు. అందుకే.. రైతుల కోసం స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. ధరల స్థిరీకరణ కోసం.. రూ.300 కోట్లతో ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని రంగాలూ అభివృద్ధి చెందాలన్న ధ్రుఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. మేలైన వ్యవసాయం.. మేలైన రాబడి నినాదంతో రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. విత్తనాలు, పురుగు మందుల నుంచి రైతులకు ఇచ్చే సబ్సిడీల వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు.

## జగన్ డౌట్ కరెక్టేనా...ఆ ఎమ్మెల్యే జంపేనా ?

సాగింది. కందువా మరచిపోయారా లేక అని వైసీపీ అధినేత వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే సదరు ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా ఎర్రగుండపాలెం కి చెందిన తాటిపర్తి చంద్రశేఖర్ అన్నది తెలిసిందే. ఆయన వైసీపీ తరఫున గట్టిగా మీడియాలో మాట్లాడుతూంటారు. ప్రజా సమస్యల మీద గత తొమ్మిది నెలల కాములో అధికార కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ వస్తున్నారు. అటువంటి ఎమ్మెల్యే మీద వైసీపీ అధినాయకత్వం ఎందుకు అనుమానాలు పెట్టుకుంటోంది అన్న చర్చ కూడా వచ్చింది. అయితే అది అనుమానం కాదని ఒక విధంగా జరుగుతున్న ప్రచారం ప్రభావం అధినాయకత్వం మీద పడింది అని అంటున్నారు. ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం ఈ ప్రచారం సాగుతోందిట. వచ్చే నెలలో పిఠాపురంలో జరిగే జనసేన ప్లీనరీలో భారీ చేరికలు ఉంటాయని అందులో ఈ వైసీపీ ఎమ్మెల్యే కూడా ఒకరని అంటున్నారు. దీని కోసం ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి జనసేనలో చేరిన కీలక నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి తన శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. బాలినేని ఈ ఎమ్మెల్యేను జనసేనలోకి ఆహ్వానిస్తున్నారు అని అంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి శిద్ధా రాఘవరావుని జనసేన వైపు తిప్పిన బాలినేని తరువాత టార్గెట్ గా ఈ ఎమ్మెల్యే ఉన్నారని అంటున్నారు. అయితే తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ మారుతారా అది నిజమా అంటే అది పుకారుగానే చెబుతున్నారు. పైగా దానిని సొంత పార్టీవారే చేయిస్తున్నారు అని అంటున్నారు. తొలిసారి నెగ్గిన చంద్రశేఖర్ నియోజకవర్గంలో దూకుడుగా ఉండడంతో సీనియర్ వైసీపీ నేతలు తట్టుకోలేకనే ఆయన పార్టీ మారుతారని ప్రచారం మొదలెట్టారని అంటున్నారు. ఇక మాజీ మంత్రి అదే నియోజకవర్గానికి చెందిన ఆదిమూలం సురేష్ వర్గీయులు ప్రధానంగా ఈ ప్రచారం చేస్తున్నారు అని అంటున్నారు. సురేష్ 2009, 2014, 2019లలో మూడు సార్లు ఇదే నియోజకవర్గం నుంచి వరసగా గెలిచారు. జగన్ కేబినెట్ లో అయిదేళ్ళ పాటు సీఎం గా పనిచేశారు. ఇక ఎన్నికల ముందు భారీ మార్పులు చేసిన నేపథ్యంలో ఆదిమూలం సురేష్ ని కొండెపికి మార్చారు. అక్కడ పోటీ చేసిన ఆయన ఓటమి పాలు అయ్యారు. దాంతో తిరిగి తన సొంత నియోజకవర్గం ఎర్రగుండపాలెం వైపు చూస్తున్నారు అని అంటున్నారు.

## ఉగాదికే ముహూర్తం

నాగబాబు పోటీకి దూరంగా ఉండిపోయారు. ఇక ఆ తర్వాత రాజ్యసభకు వెళ్లాలని ఆశపడ్డారు. గత ఏడాది జరిగిన రాజ్యసభ ఉప ఎన్నికల్లో సీటు ఆశించారు నాగబాబు. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే రెండు స్థానాల్లో రాజీనామా చేసిన వారినే తిరిగి ఎన్నుకోవాల్సివచ్చింది. మిగిలిన సీటును నాగబాబు కోరుకున్నారు. ఐతే టీడీపీలో ఆ సీటు కోసం తీవ్ర పోటీ ఉండటంతో నాగబాబును ఎమ్మెల్సీగా ఎంపిక చేసి రాష్ట్ర మంత్రివర్గంలో చేర్చుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. దీనికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఓకే అన్నారు. అయితే తాజాగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ రావడంతో నాగబాబు ఎమ్మెల్సీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయంటున్నారు. జనసేనలో ఆయనకు ఎవరూ పోటీ లేకపోవడంతో నాగబాబు ఎమ్మెల్సీ అవడం దాదాపు ఖాయమంటున్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం నాగబాబు త్వరలో ఎమ్మెల్సీ అవ్వడం ఖాయమంటున్నారు. ఐదు ఖాళీల్లో జనసేన నుంచి నాగబాబు మండలిలో అడుగు పెట్టడం లాంఛనమే అని టాక్ వినిపిస్తోంది. అయితే ఆయన మంత్రిగా బాధ్యతలు ఎప్పుడు చేపడతారనేది ఆసక్తిరేపుతోంది. అయితే కూటమిలో జరుగుతున్న ప్రచారం ప్రకారం 20న ఎన్నికల ప్రక్రియ ముగియనుండగా, 30న తెలుగు సంవత్సరాది ఉగాది పండగ వస్తుంది. తెలుగువారికి ఉగాది సెంటిమెంటు ఎక్కువ కనుక.. ఆ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అయితే నాగబాబు ఒక్కరికే మంత్రి పదవి వస్తుందా? లేక ఒకటి రెండు రాజీనామాలు తీసుకుని ఆ మేరకు సీనియర్లతో సర్దుబాటు చేస్తారా? అనేది చర్చకు తావిస్తోంది.

## ఆరోగ్య వరం!

మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీకి తెలియచేశారు. ఈ పథకం అమలుతో పేదలు మధ్యతరగతి వర్గాలు కూడా నేరుగా కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్యాన్ని పొందవచ్చు. అంటే వారి ఆరోగ్యానికి చక్కని భరోసాగా ఈ పథకం ఉంటుంది అన్న మాట. సాధారణంగా ఆరోగ్య బీమాలను ఉన్నత మధ్యతరగతి వర్గాలు ఉన్నత వర్గాలు తీసుకుంటారు. దాని వల్ల వారికి మేఉ జరుగుతుంది. వారి ఆరోగ్యానికి ఒక బీమా ధీమా కూడా ఉంటాయి. కానీ పేదలు మధ్యతరగతి వర్గాలకు ఆ చాన్స్ లేదు. పాలసీలు వారు అధిక మొత్తాలు చెల్లించి తీసుకోలేరు. వారికి ఆ స్తోమత ఉండదు. దాంతో వారు ఇబ్బందులో పడతారు. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినపుడు లక్షలలో ఖర్చు తట్టుకోలేరు. ఇక ఆరోగ్యశ్రీ ద్వారా గతంలో సేవలు అందినా ఇపుడు దాని విష్యంలో కూడా పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. చాలా కార్పోరేట్ ఆసుపతులు ఆరోగ్యశ్రీని పక్కన పెడుతున్నాయి. దీంతో హెల్త్ ఇన్సూరెన్స్ ఉంటేనే ఆపత్కాలంలో ప్రాణాలు నిలిచినట్లుగా ఉంటుంది. అయితే ప్రభుత్వమే ఈ విషయంలో చొరవ చూపించి ఆరోగ్య బీమా కింద ఏడాదికి పాతిక లక్షలు ఒక కుటుంబం కోసం పాలసీని తీసుకోవడం హర్షణీయమని అంటున్నారు. ఈ పలసీకి అయ్యే సొమ్ముని ప్రభుత్వమే ప్రతీ ఏటా చెల్లిస్తుంది. దాంతో ఇది ఒక విధంగా ఆరోగ్య వరంగా పేదలకు ఉంటుంది అని అంటున్నారు. కూటమి బడ్జెట్ లో మిగిలిన పథకాలు ఎలా ఉన్నా ఇది మాత్రం చక్కని పథకమని అంటున్నారు. దీనిని కనుక ఏపీలో అమలు చేస్తే దేశంలో అనేక రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా ఉంటుందని అంటున్నారు.

## యతిప్రాసల రియాక్షన్!

ముంచే ప్రభుత్వం అనే విషయం తొలి బడ్జెట్ తోనే నిరూపితం అయ్యిందని చెప్పిన షర్మిల.. సుపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్ అని ఫైరయ్యారు. ఈ సందర్భంగా ప్రకటించిన బడ్జెట్ కేటాయింపులు.. వాస్తవంగా అవసరమైన మొత్తానికి సంబంధం లేదని చెబుతూ.. ఘణాంకాలతో సహా ఎక్స్ వేదికగా వివరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా... అన్నదాత సుఖీభవ పథకం కోసం రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులు ఎదురుచూస్తుంటే.. అందుకు రూ.11 వేల కోట్ల నిధులు కావాల్సి ఉంటే.. తాజా బడ్జెట్ లో ఆ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడం అన్యాయమని.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుంటే.. ముష్టి రూ.300 కోట్లు ధరల స్థిరీకరణ నిధికి ఇవ్వడం ద్రోహమే అని షర్మిల అన్నారు. ఇక తల్లి వందనం పథకానికి కేటాయించిన నిధులపైనా షర్మిల మండిపడ్డారు. ఇందులో భాగంగా... రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు ఈ తల్లికి వంధనం పథకం కింద రూ.12,600 కోట్లు అవసరం అయితే.. కేవలం రూ.9,407 కోట్లు కేటాయించారని.. అంటే.. సుమారు మరో రూ.3వేల కోట్ల మేర విద్యార్థులను తగ్గించాలనుకున్నారా అంటూ ఆమె ప్రశ్నించారు. దీపం-2 పథకానికి ఏడాదికి రూ.4,500 కోట్లు అవసరం అయితే.. ఈ ఉచిత సిలిండర్ల పథకానికి రూ.2,601 కోట్లు మాత్రమే కేటాయించారని.. అంటే.. కోటిన్నర మంది లబ్ధిదారుల్లో సగం మందికి కోత పెట్టదలచుకున్నారా అని ప్రశ్నించారు. నెలకు రూ.1,500 ఇచ్చే మహాశక్తి పథకాన్ని మాయం చేశారని.. ఫలితంగా, కోటిన్నర మంది మహిళలకు అన్యాయం చేశారని విమర్శించారు. ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదని.. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ లో నెలకు రూ.350 కోట్లు ఈ పథకానికి కేటాయించడానికి ప్రభుత్వానికి మనసురాలేదని.. రూ.10 లక్షల వరకూ ఉచిత రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశారని.. నిరుద్యోగభృతి టాపిక్కే లేదని షర్మిల పేర్కొన్నారు. ఈ విధంగా... రాష్ట్రంలోని అన్ని కేటగిరీ ప్రజలనూ మోసం చేసిన ఈ బడ్జెట్ లో విజన్ లేదు, విజ్డమ్ లేదు, కేవలం ఇంద్రజాలమే ఉందని.. మిషన్ లేదు మీనింగ్ లేదు కేవలం మహేంద్రజాలమే అని షర్మిల దుయ్యబట్టారు.

## రామచంద్రపురంలో
# ఘనంగా టైలర్స్ డే





**రామచంద్రపురం నియోజకవర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దర్జీ దినోత్సవం సందర్భంగా రామ చంద్రపురం టౌన్ హాల్ నందు టైలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుబ్బల సత్తిబాబు ఆధ్వర్యంలో విలియమ్స్ హౌ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టైలర్ సోదరులు అందరూ కాలిసి ర్యాలీ నిర్వహించారు. సాగర్ టైలర్ మరియు ఇతర పెద్దలు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది కుటుంబీకులకు కుట్టు మిషన్ ద్వారా ఉపాధి కల్పించిన ఘనత విలియమ్స్ హౌ కె దక్కుతుంది అన్నారు. స్త్రీ అయినా పురుషుడైన విలువైన వలువలు ఆయా వ్యక్తుల శరీర ఆకృతికి అనుగుణంగా టైలర్ ఎంతో చాకచక్యంగా నైపుణ్యంతో వస్త్రాలు కుట్టడం ద్వారా ఆ వస్త్రధారణ వలన వ్యక్తుల ఘనత పెరుగుతుందని అన్నారు. ఎంత విలువైన వస్త్రమైనప్పటికీ సరైన కొలతలతో కుట్టిన వస్త్రం మనిషి అందాన్ని ఇనుమడింప చేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం రామచంద్రపురంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సోమన్న, మాజీ అధ్యక్షులు యండమూరి చంద్రశేఖర్, సీనియర్ టైలర్ సాదురావు యండమూరి శ్రీనివాస్, వెంప అర్జునరావు ఇతర కార్యవర్గ సభ్యులు టైలర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్లు రిపేరు చేసే మండా రామారావు జానకి దంపుతుల ను ఘనంగా సన్మానించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# తెలుగుదేశం దురాగతం

- ఓటర్లకు డబ్బుల ఎర వేయడానికి సిగ్గులేదా
- చంద్రబాబు వ్యవహారశైలిపై సిగ్గుపడుతున్నా
- పోలింగ్ తీరు తెన్నులపై హర్షకుమార్ వ్యాఖ్యలు







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటర్ ని ప్రభావితం చేసేందుకు పిఠాపురం పట్టణం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ స్కూల్లో ఎదురుగా ఉన్న మున్సిపల్ కళ్యాణ్ మండపంలో టిడిపి నాయకులు డబ్బులు పంపిణీ చేసారని మాజీ ఎంపీ జివి హర్షకుమార్ ఆరోపించారు. అయినా పోలీసులు పట్టించుకోనట్లు వ్యవహరించి, తెలుదేశానికి పూర్తి దన్నుగా నిలిచారని ఆయన ఆవేదన చెందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షకుమార్ కుమారుడు జివి సుందర్ పోటీచేస్తున్న సంగతి తెల్సిందే. సుందర్ తరపున పోలింగ్ బూత్ ఏజెంట్లను ఎలక్షన్ సిబ్బంది.అడ్డుకుంటున్నారని ఆయ న ఆరోపించారు. ఇన్ని అక్రమాలు, దురాగతాలు చేస్తేనే నెగ్గుతారా, మాములుగా నెగ్గలేరా అని తెలుగుదేశం శ్రేణులను హర్షకుమార్ నిలదీశారు. చంద్రబాబు వ్యవహారంపై చాలా సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు.

## ప్రజలకు అనుగుణంగా 25-26 బడ్జెట్
# గత ప్రభుత్వం పెట్టి వెళ్ళిన బకాయిలు చెల్లించాం

**- రాష్ట్ర పునఃనిర్మాణం దిశగా బడ్జెట్ - ఎమ్మెల్యే సత్యానందరావు**

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** 3.22 లక్షల కోట్లతో అభివృద్ధి,సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపులు రాష్ట్ర పునఃనిర్మాణం చేసేలా నేడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా,రాష్ట్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం అధికంగా కేటాయింపులు చేసిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ రూపొందించడం చాలా సంతోషంగా ఉందని వెల్లడించారు.3.22 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చేలా ఉందని సత్యానందరావు పేర్కొన్నారు. వ్యవసాయ బడ్జెట్ రూ.48 వేల కోట్లు పాఠశాల విద్యాశాఖ-రూ. 31,806 కోట్లు బీసీ సంక్షేమం.రూ.23,260 కోట్లు, వైద్యారోగ్య శాఖ-రూ.19,265 కోట్లు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ-రూ.18,848 కోట్లు, జలవనరుల శాఖ-రూ.18,020 కోట్లు, పురపాలక శాఖ-రూ.13,862 కోట్లు ఇంధన శాఖ-13,600 కోట్లు రవాణాశాఖ-రూ.8,785 కోట్లువ్యవసాయశాఖ-రూ.11,632 కోట్లు సాంఘిక సంక్షేమం కోసం రూ.10,909 కోట్లు కేటాయింపు ఆర్థికంగా వెనుకబడినవారి సంక్షేమంకోసం10,619 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ప్రాజెక్టుల గ్యాప్ ఫండింగ్ స్కీమ్‌కు రూ.2వేలకోట్లు తొలిసారిగా భాషాభివృద్ధికి నిధుల కేటాయింపు తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయింపు ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్‌షిప్‌లకు రూ.3,377కోట్లు మనబడి పథకానికి రూ.3,486 కోట్లు తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు బాల సంజీవని పథకానికి రూ.1,163 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు రోడ్ల నిర్మాణం,మరమ్మతులు రూ.4,220 కోట్లు పోర్టులు, ఎయిర్‌పోర్టులు రూ.605 కోట్లు ఆర్టీజీఎస్‌కు రూ.101 కోట్లు, ఐటీ,ఎలక్ట్రానిక్స్‌కు రాయితీలు రూ.300 కోట్లు, ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ రూ.27,518 కోట్లు ఆదరణ పథకానికి రూ.1000 కోట్లు, మనబడి పథకానికి రూ.3,486 కోట్లు తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు దీపం 2.%ూ% పథకానికి రూ.2,601 కోట్లు బాల సంజీవని పథకానికి రూ.1,163 కోట్లు చేనేత, నాయీబ్రాహ్మణుల ఉచిత విద్యుత్‌కు రూ.450కోట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్‌షిప్‌లకు రూ.3,377కోట్లు, స్వచ్ఛ ఆంధ్రకు రూ.820 కోట్లు, ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు రూ.400 కోట్లు అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,300 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు సాగునీటి



ప్రాజెక్టులకు రూ.11,314 కోట్లు పోలవరం నిర్మాణానికి రూ.6,705 కోట్లు, జల్‌జీవన్ మిషన్‌కు రూ.2,800 కోట్లు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.500 కోట్లు కేటాయింపు చేసామన్నారు.

**గత ప్రభుత్వం పెట్టి వెళ్ళిన బకాయిలు చెల్లించాం**

జూన్ 12, 2024 నాటికి ఉన్న రూ.23,556 కోట్ల బకాయిలు చెల్లించామని,రూ.9,371 కోట్ల బకాయిలు కేంద్రానికి చెల్లించటం ద్వారా,74 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునః ప్రారంభించాం, నీటి పారుదల, రహదారుల బకాయిలు రూ.12,735 కోట్లు చెల్లించామని వివరించారు. తెలుగుదేశం, జనసేన, భాజపా ప్రభుత్వం ప్రజలకు అనుగుణంగా 2025-26 బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

## గిరిజనులను నట్టేట ముంచే
# అక్రమ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వద్దు..

**- ఒడిస్సాలో పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక భారీ నిరసన సభ**
**- మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో లైవ్‌లో వామపక్ష నేతలు ముఖాముఖి**



**చింతూరు డివిజన్, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదివాసీలను నిండా ముంచే అక్రమ పోలవరం ప్రాజెక్టును నిర్మించవద్దని సంస్కృతి సాంప్రదాయాలను కనుమరుగు చేస్తూ అడవి తల్లిని నమ్ముకొని ఉన్న ఊరుని దూరం చేస్తున్న ప్రాజెక్టు తమకు వద్దంటూ ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా మోటు తాలూకా కేంద్రంలో క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక నిరసన సభ వేలాదిమంది నిరసనకారులతో విజయవంతమైనది. తొలుత శబరి పవిత్ర జలాలను గిరిజన స్త్రీలు కుండలతో మోసుకొని వచ్చి రెండు కిలోమీటర్లు దూరంలో



ఏర్పాటుచేసిన సభ వేదిక వద్ద ప్రాజెక్టు వ్యతిరేక నిరసన సభ వద్ద జలాభిషేకం చేసి సభ ప్రారంభించారు. తెలంగాణ జానపద నృత్య కళాకారులు డప్పు వాయిద్యాలతో పోలవరం నిరసన గేయాలను ఆలపించారు. గిరిజన సాంప్రదాయ డోలు కొమ్ము నృత్యాలతో నిరసన సభకు విచ్చేసిన నాయకులకు స్వాగతం పలికారు. నిరసన సభను ఉద్దేశించి మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రదీప్ మాంజి, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జే కే సి టి ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ మోటు తాలూకాలోని 12 గ్రామ పంచాయతీలలో తాతల కాలం నుండి భూములను నమ్ముకొని అడవి తల్లిని ఆసరాగా చేసుకొని జీవిస్తున్న అడవి బిడ్డలైన ఆదివాసీలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మునిగిపోతున్నారని నేటికీ వారికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడం బాధాకరమన్నారు. పక్కనే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరుగు రాష్ట్రం ఆంధ్రాలో ప్యాకేజీ పట్ల ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుండి ప్యాకేజీ నిధులను తీసుకువస్తుందని






పునరావాస కార్యక్రమం కూడా ముమ్మరంగా కొనసాగుతుందని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రంలో ఆంధ్ర సరిహద్దున ఉన్న మోటు తాలూకా పరిధిలోని ఆదివాసి గ్రామాలు ప్రతి సంవత్సరం వరదలకు ముంపునకు గురై వారి పంటలు ఆస్తులు నష్టపోతున్నారని వారిని పరిగణలోకి తీసుకోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉన్నత న్యాయస్థానాలు కూడా పరిహారం ప్యాకేజీ అందించిన తర్వాతే ప్రాజెక్టు కట్టాలని ఖరాఖండిగా తీర్పు చెప్పినా కానీ దానికి విరుద్ధంగా ప్రభుత్వాలు అక్రమంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఆదివాసీలను నట్టేట ముంచుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం తెలంగాణ ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ ఆదివాసి రాష్ట్ర నాయకులు చందా లింగయ్య నేరుగా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తో లైవ్ లో మాట్లాడుతూ ఆదివాసీలు నమ్ముకున్న అడవి తల్లి నీ దూరం చేసి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కనుమరుగు చేసే కట్టడం పోలవరం అని గిరిజనులకు న్యాయం చేయాలని దీనిపై అనేక సమరశీల పోరాటాలు కూడా గతంలో చేయడం జరిగినది అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల ఉనికిని కాపాడే చర్యలు చేపట్టాలని లేకుంటే ఆదివాసీ లలిత ఏకమై తిరుగుబాటుకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా తెలుపుతూ తాము చేసే పోరాటానికి తమ మద్దతు కావాలని నవీన్ పట్నాయక్ను కోరినారు. నాయకుల న్యాయమైన డిమాండ్లకు నవీన్ పట్నాయక్ సానుకూలంగా స్పందించి తమ ప్రభుత్వం అధికారంలో లేకపోయినా కానీ ప్రతిపక్షంగా శాసనసభలో ఆదివాసీలకు జరిగే అన్యాయంపై ఖచ్చితంగా ప్రశ్నిస్తామని ఆదివాసీలకు పోలవరం ప్రాజెక్టు వలన కలిగే ముప్పును ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి కేంద్రానికి నివేదిక పంపిస్తామని ఆదివాసీలు చేసే న్యాయమైన పోరాటానికి తాము ఎప్పుడు అండగా ఉంటామన్నారు. గతంలో కూడా తమ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వానికి పోలవరం ముంపు విషయంలో లిఖితపూర్వకంగా తెలియజేసి అనంతరం స్వయంగా ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అన్నారు. ప్రాజెక్టు ప్రభావంతో ముంపుకు గురయ్యే ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేసే వరకు తాను అవిశ్రాంతంగా పోరాటం చేస్తానని గిరిజన హక్కులు కాపాడేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. అనంతరం పలువురు మాజీ మంత్రులు మాట్లాడుతూ పోలవరం విషయం కేవలం రాష్ట్రానికి కాదని కేంద్ర ప్రభుత్వానికి కూడా బాధ్యత ఉందని బహుళార్థక ప్రాజెక్టు కట్టడం దేశానికి మంచిదైన ముంపుకు గురయ్యే నిర్వాసిత కుటుంబాలకు నష్టం వాటిల్లకుండా పరిహారం చెల్లించాలని నష్టాన్ని అంచనా వేసి అధికారులను ముంపు ప్రదేశాలకు తక్షణమే పంపి సర్వేలు నిర్వహించి నివేదికలకు ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ తరహాలో పరిహారం పునరావాసం కల్పించాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తో లైవ్ లో విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మనోజ్ మడకామి, మాజీ మంత్రి పద్మిని ధ్యాన్, మాజీ మంత్రి రవి నారాయణ, కోరాపుట్ పీసీసీ అధ్యక్షులు ఈశ్వర పాణిగ్రహి, ఆమ్ ఆద్మీ మల్కనగిరి అధ్యక్షులు రమేష్ చంద్ర, మాజీ పార్లమెంటు సభ్యులు మొన్న ఖాన్, మాజీ ఎంపీ ప్రతి మాజీ, గ్రామ పెద్దలు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోదామును తనిఖీ చేసిన జిల్లా రెవెన్యూ అధికారి

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఈవీఎంల భద్రపరచిన గోదామును అధికారులతో కలిసి పరిశీలించారు. నెలవారి తనిఖీలో భాగంగా గోదాము సీళ్ళను తనిఖీ చేసి రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు నెలకోసారి ఈవీఎం ల గోదామును తనిఖీ చేయడం జరుగుతుందని.. ప్రతి మూడు నెలలకోసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం ల గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డి టి శివరాజ్ ముమ్మిడివరం డిప్యూటీ తాసిల్దార్ గోపాలకృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






### మండపేటలో
## ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హెూ పుట్టినరోజు సందర్భంగా మండ పేట పట్టణంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట పట్టణ టైలర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలియం హెూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రెడీమేడ్ రంగం వల్ల ప్రస్తుతం తమకు ఉపాధి కి నష్టం వాటిల్లుతుందన్నారు. టైలర్లకు ప్రభుత్వం సబ్సిడీ పథకాలను అందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.




## భాష్యం స్కూలో నేషనల్ సైన్స్ డే

**రాజోలు నియోజకవర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** మలికిపురం మండలం గుడిమెళ్లంక భాష్యం స్కూల్లో ప్రిన్సిపాల్ వాసంశెట్టి వెంకటేశ్వర ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సైన్స్ ప్రాజెక్ట్‌లో ఉత్తీర్ణులైన వారికి జాతీయ సేవా రత్న తాడి సహదేవ్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కదలి ప్రియసుధా మరియు తల్లి దండ్రులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.





శనివారం 1/ మార్చి/2025
www.viswamvoice.com

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

### సంక్షేమానికి భారీగా
## నిధులు బడ్జెట్లో అభివృద్ధికి పెద్ద పీట

**- జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి.ముత్యాల బాబ్జి**
**టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** బడ్జెట్లో అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు రోడ్ల నిర్మాణం,మరమ్మతులు రూ.4,220 కోట్లు పోర్టులు, ఎయిర్‌పోర్టులు రూ.605 కోట్లు,పోలవరానికి రూ.6,705 కోట్లు కేటాయించడం ద్వారా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసింది.ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ రూ.27,518 కోట్లు ఆదరణ పథకానికి రూ.1000 కోట్లుమనబడి పథకానికి రూ.3,486 కోట్లు తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు, బాల సంజీవని పథకానికి రూ.1,163 కోట్లు చేనేత, నాయీబ్రాహ్మణుల ఉచిత విద్యుత్‌కు రూ.450కోట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్‌షిప్‌లకు రూ.3,377కోట్లు స్వచ్ఛ ఆంధ్రకు రూ.820 కోట్లు, ఎస్సీ,ఎస్టీల ఉచిత విద్యుత్‌కు రూ.400 కోట్లు అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,300 కోట్లు ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు కేటాయించడం ద్వారా సంక్షేమానికి భారీగా నిధులు అందించింది.రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలకు ప్రభుత్వం తొలి అడుగు వేసిందని తెలియజేశారు.

## బడ్జెట్ ఫాన్సీ నెంబర్‌లు తప్పా, ప్రజలకు మేలు జరిగింది లేదు

**- 420కి అంబాసిడర్ సీఎం చంద్రబాబు - మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర ఆరోపణ**




**కొత్తపేట, రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రజలను నమ్మించి సూపర్ సిక్స్ పథకాలతో గద్దె నెక్కి ఈ బడ్జెట్‌తో ప్రజలను వంచించి మోసానికి బ్రాండ్ అంబాసిడర్ గా చంద్రబాబు మారారని కొత్తపేట నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశం పెట్టలేని స్థాయి నుంచి బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలు కు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అందుకు అనుగుణంగా బడ్జెట్ లో కేటాయింపులు లేని విధంగా నయవంచన చేసిన సీఎం బాబు అని ఏద్దేవా చేసారు. ఉచిత బస్ ఊసే లేదు, నిరుద్యోగ భృతి లేనే లేదు, రైతులకు కేవలం 6300 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీపం పథకానికి తుతు మాంత్రపు కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రైతులకు కిట్టుబాటు ధర విషయంలో దగా చేసాడు,గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే అన్ని పంటలుకు గిట్టు బాటు ధర కల్పించే విషయంలో ముందుంటే బాబు కేవలం మిర్చి రైతులుకు తుతు మంత్రాపు చర్య లతో ఏదేదో చేశామనే భ్రమల్లో ఉన్నారని ఆయన చెప్పారు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఒక మాట, అయ్యాక ఒక మాట చెబుతున్నారని తల్లికి వందనం పథకానికి యేటా ఇరవై ఐదు వేల కోట్లు కావాలి, కానీ అందులో కూడా మోసం చేసాడు 420 బాబు అని తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నిస్తా అన్న పవన్ కళ్యాణ్ ఏమైయ్యడ మహిళాకు 18500స్కీం ఏమయ్యింది? పవన్‌కళ్యాణ్ పక్క సీట్ పయ్యావుల కేశవ దేగా అయనతో చెప్పి ఎందుకు బడ్జెట్‌లో భారీగా నిధులు పెట్టించలేదు అని అడుగుతున్న అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటి వరకు మేమి ప్రశ్నిస్తున్నాము ప్రశ్నిస్తామన్నవారు సైలెంట్‌గా కూర్చోవడమేనా అని ఆశ్చర్యం వ్యక్తం చేసారు. రాష్ట్రము లో ధరల నియంత్రణ ఎందుకు లేదు, నిత్యవాసరా సరుకులు ఆకాశానంటాయి, భూమి ధరలు పెంపు, కరెంట్ చార్జీలు పెంపు ఇవన్నీ ఎన్నికల ముందు పెంచాను అని చెప్పి ఇప్పుడు పెంచేయడం నీకు ప్రజలు కు వెన్నుపోటు పొడవడం, మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని తీవ్రంగా విమర్శ చేసారు. ప్రశ్నిస్తామన్నా వారు పదవులు తీసుకుని సైలెంట్‌గా ఉంటే, ప్రశ్నిస్తున్న వారి గొంతు నొక్కలని జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి పక్షం హెూదా ఎందుకు ఇవ్వరు? ఇది గొంతు నొక్కడం కాదా అని అడుగుతున్న అంటూ తీవ్రంగా ఆరోపించారు. నార్త్‌లో అధికారం ఉన్నవారు వారి రాష్ట్రానికి కావాల్సిన నిధులు తేవడం సపలమయ్యారని, కానీ మన రాష్ట్ర పాలకులు నిధులు తీసుకురావడంలో విపమయ్యారు,కేవలం మన వాళ్ళు 100కి 42రు మాత్రమే తెస్తుంటే,ఉత్తరాది రాష్ట్రాలలో పన్ను 100 చెల్లిస్తుంటే వాళ్ళు తిరిగి 70 నుంచి 90 శాతం వరకు తెచ్చుకుంటుంటే మీరు 42శాతం మాత్రమే తీసుకోవడం ఏమిటని, ఇంత కన్నా దద్దమలు అని అనిపించుకోవడం కాదా అని తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ అంటే లోకేష్ కి భజన గా మారిందని,ఏ పథకం అమలు చేయక పోయిన కలర్ పట్టుకోండి అన్న పప్పు సుద్ద, ఇప్పుడు కలర్ పట్టుకుని ప్రశ్నించవలసిన సమయం వచ్చింది గనుక, ప్రశ్నిస్తా అన్న పీకే ప్రశ్నించాలి అని హితువు పలికారు. ఆలా ఇస్తే ఇక్క ఎమ్మెల్యే సత్యానంద రవుకు రాష్ట్రములో రెండవ ర్యాంక్ ఈయన కె వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్ రాజు, కొత్తపేట మండల అధ్యక్షులు మార్గాన్ని గంగాధర్, జెడ్పీసి సభ్యులు కూడుపూడి శ్రీనివాస్,మాజీ ఎస్సి సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, వర్మ, ముషీన వెంకటేశ్వరావు, దొమ్మటి అర్జునరావు,తమ్మనా శ్రీనివాస్ బొక్క ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### మైనారిటీల సంక్షేమం కొరకు
## భారీగా నిధులు కేటాయింపు

**జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షరీఫ్**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** బడ్జెట్ సమావేశంలో ముస్లిం మైనారిటీ సంక్షేమానికి అత్యధికంగా బడ్జెట్‌ని కేటాయించడం పట్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్,హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి, మైనార్టీ సంక్షేమం కోసం 5,434 కోట్ల భారీ నిధులను కేటాయించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి షరీఫ్ అభినందనలు తెలిపారు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, దేశంలోనే మొదటిసారిగా అత్యధిక నిధులను మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రాష్ట్రంగా మన ఆంధ్రప్రదేశ్ నిలిచింది అని షరీఫ్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే ఇంత భారీ బడ్జెట్ ని కేటాయించేందుకు కృషి చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి యన్ యండి ఫరూక్ కి మరియు ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఎ షరీఫ్ కి ధన్యవాదాలు తెలిపారు వారిద్దరి నిబద్ధత కృషి ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించింది అని తెలియజేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీల సంక్షేమం కోసం ఇంత పెద్ద నిధులు కేటాయించి మైనార్టీల సంక్షేమం కొరకు కట్టుబడి ఉన్నట్లు మరోసారి రుజువు చేశారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం క్రిస్టియన్ బుద్దిస్ట్ మరియు సిక్కు సమాజం తరఫున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## టైలర్స్ డే సందర్భంగా ప్రకాష్ టైలర్‌కు ఘన సత్కారం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** యూనియన్ గౌరవ అధ్యక్షుడు చింతా రామలింగేశ్వరరావు (ప్రకాష్ టైలర్)ను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ టైలర్స్ అసోసియేషన్ భవనంలో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్య సలహాదారులు కంచిపల్లి అబ్బులు సెక్రటరీ కొమ్మూరు వెంకటాచల ప్రసాద్ ట్రెజరర్ దొమ్మేటి సాయిబాబు. చాంబర్ ఉపాధ్యక్షులు మోకా వెంకటసుబ్బారావు నమ్మిన వీరబాబు.. ఆశెట్టి. శ్రీను పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ట్రైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాకాడ భాస్కర రావు సెక్రెటరీ దొడ్డ శ్రీనివాసరావు ట్రెజరర్ దేవ పూజలు బాబి టైలర్స్ అసోసి యేషన్ సభ్యులు సహాజరైయ్యారు.

## రాష్ట్రబడ్జెట్ అందరికి ఆమోదయోగ్యం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన 2025-26 రాష్ట్ర బడ్జెట్ అందరికి ఆమోదయోగ్యం ఉంది. ముఖ్యంగా రైతులకు పెద్దపీట వేసి రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపదను, ఆర్థిక వనరులను సృష్టించగలరు, బడ్జెట్‌ను అమలు చెయ్య గలరు, సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు బడ్జెట్‌లో చోటు కల్పించడం, డొక్కా సీతమ్మ పేరిట పాఠశాలల లో మధ్యాహ్నం బడి భోజనం, ఎన్టీఆర్ భరోసా పేరిట రైతుల కు పెట్టుబడి సాయం, వైద్య, ఆరోగ్యం నిమిత్తం బడ్జెట్ కేటాయింపు హర్షనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం తెలియజేశారు.

### సెయింట్ మేరీ చైతన్య ఇంగ్లీష్ మీడియం
## హైస్కూల్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్:** రామచంద్రపురం మండలం ద్రాక్షరామం అన్నాయ్ పేటలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం సెయింట్ మేరీ చైతన్య హైస్కూల్ నందు స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి సెయింట్ మేరీ స్కూల్ అధినేత లంక చిట్టిబాబు, విజయ్ భారతి, ప్రిన్సిపాల్ శ్యామ్ పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం లంక చిట్టిబాబు భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సర్ సివి రామన్ అని, ఫిబ్రవరి 28 ప్రతి సంవత్సరం జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణిమన్నారు. అనంతరం ప్రిన్సిపల్ శ్యాం మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని భవిష్యత్తులో ఉన్నత స్థానం సాధించాలని సమాజ అభివృద్ధి కొరకు కృషి చేయాలని పేర్కొన్నారు. సెయింట్ మేరీ చైతన్య హైస్కూల్ సైన్స్ అధ్యాపకులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, పలువురు ఈ సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



## వేసవికాలం తాగునిటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం

**- ఉమ్మడి జిల్లాల జెడ్పి సిఇఒ లక్ష్మణ్**
**- బోడసకుర్రు, గుండెపూడి మంచినీటి ప్రాజెక్టుల పరిశీలించిన సీఈఓ**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేసవిలో ప్రజలకు తాగునిటి ఎద్దడి రాకుండా నివారణకు ముందుగానే చర్యలు చేపడుతున్నామని ఉమ్మడి జిల్లాల జెడ్పి సిఇఒ లక్ష్మణ్ అన్నారు. అల్లవరం మండలంలోని బోడసకుర్రు, గుండెపూడి గ్రామాల మంచినీటి ప్రాజెక్టులను జెడ్పి సిఇఒ లక్ష్మణ్, మండల అభివృద్ధి అధికారి బి. కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు శుక్రవారం పరిశీలించారు. ముందుగా నూతనంగా ప్రారంభమైన బోడసకుర్రు సచివాలయం -2 ను సందర్శించి, అధికారుల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పి సిఇఒ మాట్లాడుతూ ముఖ్యంగా బోడసకుర్రు మంచినీటి ప్రాజెక్టు వద్ద పలు సమస్యలు గుర్తించడం జరిగిందని, వాటర్ పంపింగ్ సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. అదనపు విద్యుత్ మోటర్ ఏర్పాటు చేయాలని పెద్దలు కోరారని దీనిపై ఉన్నత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. 15 ఫైనాన్స్ నుండి 6 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఈఓ లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డబ్ల్యూఎస్ డిఈ రామ్ ప్రసాద్, ఏఇ స్వామి పంచాయతీ కార్యదర్శి సింగపల్లి దుర్గాశ్రీను, ముత్యాల బాబి, తదితరులు పాల్గొన్నారు.



## వాకలపూడి ఎస్సి పేట భూమిని కబ్జాదారుల నుండి రక్షణ కల్పించండి

**- అ భూమి ఎస్సిలకు అప్పగించాలని ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చిన బిఎస్పీ నేత సుబ్బు భాయ్**



**కాకినాడ జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం పూర్వం వాకలపూడి ప్రస్తుతం వలసపాకల గ్రామానికి చెందిన సుమారు 28 సెంట్లు భూమి వాకలపూడి ఎస్సీ పేటకు చెందిన భూమి ఈ 30 సెంట్లు మొదట్నుంచి కూడా హరిజనవాడకు చెందిన భూమిగా నమోదు కాబడి ఉంది ఆ భూమిని కబ్జా చేసి స్వాధీనపరచుకోవాలని ప్రయత్నిస్తుండగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం సుబ్బు బాయ్ మరియు జిల్లా ఇన్చార్జ్ సబ్బరపు అప్పారావు దానిపై కాకినాడ ఆర్డీఓ మల్లి బాబు కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ఆ భూమిని ఎస్సీలకు స్వాధీన పరచాలని చెప్పడం జరిగింది.ఆర్డీఓ వెంటనే సర్వే నెంబర్ చెక్ చేసి ఇది ఎస్సీలకు చెందిన భూమి కబ్జాదారుల నుండి విడిపించి ఎస్సీలకు అప్పగిస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఎస్సీలకు సంబంధించిన భూమిని ఆక్రమించుకుంటున్నది ఎవరైనా సరే వారిపై చర్యలు తీసుకుని మా భూమి మాకు అప్పగించవలసిందిగా కోరుచున్నాము లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధమవుతాం హెచ్చరించారు.



## కొమరగిరిపట్నం హైస్కూల్లో నేషనల్ సైన్స్ డే

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామంలో ఉన్న న్యాపతి సుబ్బారావు పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫిబ్రవరి 28 జాతీయ సైన్సు దినోత్సవాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. సర్ సివి రామన్ చిత్రాన్ని ముగ్గు, ఇసుక, గులకరాళ్లు మరియు బొగ్గుతో వినూత్నంగా తయారు చేశారు. ఈ చిత్రాన్ని వేయడంలో పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు నాలుగు గంటలు సమయాన్ని వెచ్చించి, చాలా కష్టపడి చక్కగా ఈ యొక్క చిత్రాన్ని తయారు చేశారు. ఈ యొక్క విద్యార్థులని ప్రధానోపాధ్యాయులు జిఎస్‌వి.రమణ అభినందించారు. ఈ చిత్రం రూప కల్పనకు సహకరించి నటువంటి తెలుగు ఉపాధ్యాయులు వై.ప్రభాకరరావుని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజనాత్మకత ను బయటకు తీసే కార్యక్రమమే సైన్స్ అని ప్రధానోపాధ్యాయులు అన్నారు.



## బోడసకుర్రులో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**- కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్**
**- రొక్కాల విజయలక్ష్మి**

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** టైలర్స్ డే సందర్భంగా టైలర్స్ డే మండల అధ్యక్షులు కడలి సాయి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం బోడసకుర్రు గ్రామంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ప్రైమరీ టైలర్స్ సహకార సొసైటీ ఈజీ డీ 37 ...వారిచే టైలర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విప్పర్తి రామకృష్ణ, సీనియర్ నాయకులు రొక్కాల నాగేశ్వరరావు, పలువురు మహిళా టైలర్ లు,పలువురు సొసైటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





### వ్యవసాయ అనుబంధ రంగాలకు
# వార్షిక బడ్జెట్లో కేటాయింపులు హర్షనీయం

**- రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ**



**కొత్తపేట, రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్:** 48,341.14 కోట్ల రూపాయలతో వ్యవసాయ బడ్జెట్ వ్యవసాయ సాగుకు వెన్ను -దన్ను ఈ బడ్జెట్ దేశం రాష్ట్రం అభివృద్ధికి వ్యవసాయమే ఆధారం వ్యవసాయ భూమున్న రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య అర్హులైన కౌలు రైతులకు హక్కుకార్డులు మంజూరు రాష్ట్రంలో రైతులకు ఇక పండగే పండగ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ వ్యవసాయ బడ్జెట్‌పై స్పందించి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ బడ్జెను సభలో ప్రవేశపెట్టారని బడ్జెట్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని రామకృష్ణ అన్నారు. మొత్తం 48,341.14 కోట్ల రూపాయలతో వ్యవసాయ బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజే ప్రవేశపెట్టిందని. వ్యవసాయ - వ్యవసాయ అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేసిందని. ఎరువులు, ప్రకృతి వ్యవసాయ వ్యవసాయ యంత్రాల రాయితీ, డ్రోన్ల రాయితీకి సంబంధించి భారీగా కేటాయింపులు జరిపారని ఈ కేటాయింపుల వల్ల రైతులకు భారీగా మేలు చేకూరనుందని ఆకుల అభిప్రాయపడ్డారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపు లు గ్రోత్ ఇంజిన్లుగా 11 పంటలను ప్రభుత్వం పేర్కొందని, 26 జిల్లాలను 11 క్లస్టర్లుగా విభజించారని ఆయన అన్నారు.ఎరువుల స్టాక్ నిర్వహణకు 40 కోట్లు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి. 61.78 కోట్లు వ్యవసాయ యాంత్రికరణకు బడ్జెట్లో 219.65 కోట్లు కేటాయింపు 7.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ, డ్రోన్ల రాయితీ కోసం రూ.80 కోట్లు 875 కిసాన్ డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాలు. వ్యవసాయ యాంత్రీకరణకు 219 కోట్లు విత్తన రాయితీ పంపిణీకి.240 కోట్లు.రైతులకు వడ్డీలేని రుణాల కింద 250.కోట్లు అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ అమలుకు 9,400. కోట్లు ఉచిత పంటల బీమా కోసం1,023 కోట్లు. వ్యవసాయ శాఖకు.12,401కోట్లు. ఉద్యాన శాఖకు .930.88 కోట్లు.పట్టు పరిశ్రమకు .96.22.కోట్లు సహకారశాఖకు 239.85 కోట్లు పశుసంవర్ధకశాఖకు 1,112.07 కోట్లు మత్స్య రంగానికి 540.19 కోట్లు. ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు బడ్జెట్లో40 కోట్లు కేటాయింపు.ఎన్జీరంగా యూనివర్సిటీకి 507.01కోట్లు బడ్జెట్లో కేటాయింపు. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి 154.57 కోట్ల రూపాయల కేటాయింపు.ఏపీ ఫిషరీస్ వర్సిటీకి 38 కోట్లు కేటాయింపు,ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి,(జోన్ నాన్ జోన్ తేడా లేకుండా) 12,733.25 కోట్లు బడ్జెట్లో కేటాయింపు. ఉపాధి హామీ పథకానికి 6026.87 కోట్లు బడ్జెట్లో కేటాయింపు, ఎన్టీఆర్ జలసిరికి రాష్ట్ర బడ్జెట్లో 50 కోట్లు కేటాయింపు నీటి వనరుల శాఖకు 12903.41 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించిందని ఆకుల రామకృష్ణ ఈ సందర్భంగా అన్నారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, దేశం,రాష్ట్రం అభివృద్ధికి వ్యవసాయమే ఆధారమని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పేర్కొన్నారు.అర్హులైన కౌలు రైతులకు హక్కు కార్డులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి అచ్చెన్ననాయుడు చెప్పారని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ఈ సందర్భంగా తెలియజేశారు.

# వాహన చట్టాలను ఉల్లంఘించిన కఠిన చర్యలు

**- సూపర్డెంట్ ఆఫ్ పోలీస్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మోటార్ వాహనాల చట్టం ప్రకారం వాహనాలను నడిపే వారు వాహన చట్టాలను ఉల్లంగించిన యెడల నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాల ప్రకారం జరిమానా మరియు జైలు శిక్ష విధించడం జరుగుతుందని సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ తెలియజేశారు 2019 కొత్త వాహన మోటారు సవరణ చట్టం ప్రకారం ట్రాఫిక్ ఉల్లంగనలకు జరిమానాలు గణనీయంగా పెంచబడి గతంలో కంటే కటినంగా మారాయని ఈ చట్టం మార్చ్ ఒకటవ తారీఖు నుండి అమలులోకి రావడం జరుగుతుందిని వెల్లడించారు. వివరాల్లోకి వెళితే ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రమా దాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని భద్రతా వారోత్సవాల కార్యాక్రమాలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థు లకు, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించడం జరి గింది. ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడి జీవన విధానము తలక్రిందిలవుతుంది. కాబట్టి వాహనాలు నడిపెటప్పుడు ఎవరి రక్షణ వారే కల్పించుకుని జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ ఎదుటి వారి ప్రాణాలను కూడా రక్షించాలని సూచించారు. కాబట్టి వాహన దారులు మరియు ప్రజలు కొత్త మోటారు వాహన చట్టాల నియమ నిబంధనల ప్రకారం వాహనాలను నడుపుతూ, తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు వాహనదారులకు సూచించడం జరిగింది.

### పోలవరం ముంపు ప్రాంతం
# విఆర్.పురం బిసీకాలనీ వాసులకు న్యాయం చేయాలి

**- పోలవరం ఇరిగేషన్ స్పెషల్ కలెక్టర్‌కి వినతి**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** పోలవరం ముంపు ప్రాంతమైన విఆర్ పురం మండలం, విఆర్ పురంగ్రామం బిసి కాలని, వడ్డిగూడెంకు చెందిన నది వాసితులకు నష్ట పరిహారం అందించేందుకు నోటిఫికేషన్ ఇచ్చి, స్ట్రక్చర్ వాల్యూ సర్వే నిర్వహించాలని ఆప్రాంతానికి చెందిన వాసులు కోరారు. ధవళేశ్వరంలోని పోలవరం ఇరిగేషన్ స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి విఆర్ పురం బిసి కాలనీ వాసులు శుక్రవారం చేరుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించి, అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు, ఎంఆర్ పిఎస్ నాయకులు ఉంగుటూరి రమేష్, బింగి విష్ణుమూర్తి, ములకలపల్లి సరోజిని తదితరులు మాట్లాడుతూ తాము వి.ఆర్.పురం మండలం, వి.ఆర్. పురం గ్రామం బి.సి.కాలనీ, వడ్డిగూడెం గ్రామ పంచాయితీకి చెందిన వారము. అని గడిచిన 60 సంవత్సరాలుగా తామంతా మా ఇంటి పన్నులు వడ్డిగూడెం గ్రామపంచాయితీ చెల్లిస్తున్నామన్నారు. వీరి ఆందోలనకు ఎంఎస్ పి జాతీయ నాయకులు ముమ్మిడివరపు చిన సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి, జిల్లా అధ్యక్షులు గెడ్డం వినోద్, జిల్లా అధికార ప్రతినిధి యార్లగడ్డ సతీష్, ఆనంద్ చిన్న బాబులు సంఘీ భావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు మోదిగ వెంకన్నబాబు, ఎం శ్రీనివాసరావు, ఉషారాణి, మోదిగ నాగేశ్వరరావు, వియ్యేటి పుల్లయ్య, గోపి సత్తిబాబు, వల్లూరి నరసింహారావు, మగుటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి బాలలే రేపటి సైంటిస్టులు

**- సెయింట్ ఆన్స్‌లో సైన్స్ ప్రదర్శన**
**- ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎస్సై హరికోటి శాస్త్రి**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఒక సైంటిస్ట్ వలే ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యావిధానంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎంతో అవసరమని టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. మండపేట సెయింట్ ఆన్స్ స్కూల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ సిస్టర్ షిబా, ప్రిన్సిపల్ సిస్టర్ సిని జోస్, ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి పాల్గొని ప్రసంగించారు. తొలుత సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శాస్త్రి మాట్లాడుతూ నేటి విద్యార్థులే దేశానికి ఉపయోగపడే భవిషత్ సైంటిస్టులన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సినీ జోస్, షిబ లు ఎస్ఐ శాస్త్రిని శాలువా, పూలబుకే తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మరియా, సిస్టర్ విజయ, సిస్టర్ యంత్రీసా, స్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, రామచంద్రరావు, బాబీ, చక్రారాజు, సాయి దుర్గ, రామశాంతి, అఫ్రీన్, షేక్ ఫర్జనా బేగం, రాధిక, సరోజ రాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఇక తప్పదు... చెత్త నుండి సంపదను సృష్టించాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఇక తప్పదు... ఇకపై ఖచ్చితంగా చెత్త నుండి సంపదను సృష్టించాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధి కారిణి బాలమణి ఆదేశించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వేళంగి, పెదమల్లాపురం, గౌరంపేట, ఎస్.జగ్గంపేట, కొంతంగి, మండపం గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను, వాటి పని తీరును ఆమె పరిశీలించారు. ఆమె వెంట మండల ఈవోపీఆర్డీ వాడ్రేవు చక్రవర్తి, శంఖవరం, కత్తిపూడి, గొంధి కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శులు కుసిరెడ్డి అప్పలరాజు, యాళ్ళ భవానీశంకరుడు, జయలక్ష్మి గణేష్, సిబ్బంది ఉన్నారు.

### ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
## ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కమల కుమారి బదిలీ

**అభినందన కార్యక్రమం**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా సుమారు నాలుగు సంవత్సరాలు అత్యుత్తమ సేవలు అందించిన ప్రొఫెసర్ ఎం.కమల్‌కుమారి బదిలీ సందర్భంగా, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు, మరియు సిబ్బంది ప్రొఫెసర్ ఎం.కమల కుమారి విశిష్టమైన సేవలను కొనియాడారు. ఆమె నాయకత్వంలో క్యాంపస్ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధన కార్యక్రమాల విస్తరణ వంటి అనేక రంగాలలో విశేష పురోగతి సాధించగలిగామని అందరూ ఉల్లేఖించారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడంలో, అధ్యాపకులకు మార్గదర్శిగా నిలిచిన విధానంలో, మరియు పరిపాలనా వ్యవస్థలో సమర్థవంతమైన మార్పులు తీసుకు రావడంలో ప్రొఫెసర్ ఎం.కమలకుమారి కృషి చిరస్మరణీయం. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కమల కుమారి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్ ఎస్ ఎమ్ క్యాంపస్, కాకినాడలో ప్రిన్సిపల్‌గా పనిచేసే అవకాశం పొందడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను అని,ఈ కాలంలో అందరి సహకారం, ఆదరణ, ప్రేమ మర్చిపోలేని అనుభూతిని అందించింది. అని ఇక్కడి విద్యా స్థాయిని మరింత మెరుగుపరచడానికి, విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు, మరియు మంచి వాతావరణాన్ని ఏర్పరిచేందుకు అందరి సహకారం. ఇప్పుడు ప్రధాన క్యాంపస్, రాజమహేంద్రవరం బదిలీ సందర్భంగా, క్యాంపస్ లోని సహచరులకు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి, ఆయమ్మలకి మరియు విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించనున్న ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత్ , అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా. ఎం.పోచయ్య మాట్లాడుతూ, ప్రొఫెసర్ ఎం.కమల్ కుమారి విధానాలను , ఆమె చేసిన మంచి పనులు గురించి, అలాగే చాలా సందర్భాలలో ఆమె క్యాంపస్ కొరకు చేసిన కృషి తెలిపారు. క్యాంపస్ అభివృద్ధిలో ఆమె చేసిన అసమానమైన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తు వృత్తిపరమైన జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు, మరియు సంభందిత సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ ఎం.కమల్ కుమారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రపంచ మానవాళి మనుగడకు సైన్సే ఆధారం

**- సీతయ్యమ్మపేట రిఫరల్ పాఠశాలలో సైన్స్ డే**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రపంచ మానవాళి మనుగడకు సైన్స్ ఒకానొక ప్రధాన ఆధారమని రూరల్ ఇండియా సెల్ఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్, రిఫరల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నికోలస్ స్లెస్సర్ బాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయ్యమ్మపేటలోని రిఫరల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. భారత దేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త, రామన్ ఎఫెక్ట్ ఆవిష్కర్త సర్ సి.వి.రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి, ఆయన స్మృతికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలకు చెందిన చిట్టి, పొట్టి, బుల్లి శాస్త్రవేత్తలు స్వయం కృషితో వారిదైన శైలిలో ఆవిష్కరించిన ఆవిష్కరణల నమూనాలను పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్ తోబాటు ముదంతస్తులల్లోనూ సందర్శకుల వీక్షణార్థం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను నికోలస్ స్లెస్సర్ బాబు, భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ సంయుక్తంగా ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ రిఫరల్ విద్యార్థులు సైన్స్ తోబాటు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తూ... ఇంతటి ఘనమైన కృషిని విద్యార్థులతో చేయిస్తున్న ఉపాధ్యాయ బృందం కృషిని అభినందించారు. చిన్నారులు తయారు చేసిన రోబో, సెన్సార్ తెఫ్ట్ అలారం, ఫైర్ లైటింగ్ అలారం, వెహికల్, వాటర్ ఫిల్టర్, పొల్యూషన్ కంట్రోల్, టెస్లా ప్రాజెక్టు, పోడు వ్యవసాయం, చంద్రయాన్, గ్రావిటేషన్, సైక్లోన్ ఎలర్ట్, ఫ్లడ్ ఎలర్ట్, హార్ట్, త్రీడి ఎఫెక్ట్ తదితర సైన్స్ ప్రాజెక్టులను సందర్శకులు వీక్షించి విద్యార్థుల కృషిని అభినందించారు. ఈ సైన్స్ ప్రాజెక్టులో ఉత్తమ వాటిని ఎంపికచేసి ఆయా విద్యార్థులకు బహుమతులను బహుకరించారు.

### రాష్ట్ర కాంగ్రెస్
## కిసాన్ సెల్ అధ్యక్షులుగా కామన



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులుగా కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఉత్తర్వులు జారీ చేశారు. కామన కాంగ్రెస్ పార్టీలో గ్రామ స్థాయి నుండి తన ప్రస్థానం ఆరంభించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీలో పలు పదవులు అలంక రించారు. మండపేట నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆరు సార్లు పీసీసీ సభ్యులుగా పని చేశారు. మూడు సార్లు ఏఐసీసీ సభ్యులుగా భాద్యతలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షులుగా పని చేశారు.

**గర్వంగా భావిస్తా....**

రైతు బిడ్డగా తనకు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్ష పదవి రావడం గర్వంగా భావిస్తున్నానని కామన పేర్కొన్నారు. మండపేట ఏడిద రోడ్ లోని కాంగ్రెస్ కార్యలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిళ తనపై నమ్మకం వుంచి తనకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్,మాణిక్ ఠాగూర్, సూక్పల్ సింగ్, డాక్టర్ పాలిక్ వర్మ,ఏం ఏం పళ్లంరాజు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కొప్పుల రాజు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ నాయకులు గేదల శ్రీనివాస్, పర్వతిన వీర వెంకట సత్యనారాయణ,మగ్గం జాకబ్ రాజు, పిల్లి అపన్న, అలమండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** మండపేట ఏడిద రోడ్‌లో వెలసిన పెద్ద మ్మ తల్లి అమ్మవారి ఆల యంలో విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులు పోటెత్తారు. ప్రతిరోజునిత్యం జరిగే పూజా కార్యక్రమాల్లో భాగం గా విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. మండపేట ఏడిద రోడ్డు పెద్దమ్మ తల్లిగా పేరుగాంచిన ఆలయంకు భక్తులు చుట్టుపక్క గ్రామాల నుండి జిల్లా నలుమూలల నుండి అమ్మ వారిని దర్శించేందుకు ప్రతి శుక్రవారం విచ్చేస్తారు. పెద్దమ్మ తల్లి ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భారీ అన్నదానం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేతినా శ్రీనివాసు, మండపూడి చంద్రశేఖర్, ఆడల్లా సత్తిబాబు, చల్ల శివరాం, ఆలయం వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం - 50 ఏళ్ళు దాటిన టైలర్లకు పెన్షన్ ఇవ్వాలి




రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా మణి ట్రైలర్స్ సారధ్యంలో శుక్రవారం శేషయ్యమెట్ట సాయిరాం ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాలు టైలర్స్ బాలు,మణి టైలర్స్ పొలమూరి వెంకట్రావు,రవి టైలర్స్, రంగా టైలర్స్, ప్రిన్స్ టైలర్స్ నాగేశ్వరరావు ఫణి టైలర్స్,బొంబాయి టైలర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన టైలర్లు కంటి వ్యాధులతో బాధపడుతున్నారని, వారికి ఉచిత వైద్యం, పెన్షన్ అందించాలని కోరారు. టైలరింగ్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు.గత 15 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీకి చైర్మన్ ను నియమించాలని కోరారు.

# షిరిడిసాయిలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: కోరుకొండ శ్రీ షిరిడిసాయిస్కూల్ లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు గరగ లక్ష్మీ పద్మావతి, సత్యం శ్యామల,శ్రీనివాస్ సీవి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గణిత శాస్త్రంలో సివి రామన్ చేసిన కృషి, సాధించిన ప్రగతిని విద్యార్థులకు తెలియజేశారు.విద్యార్థిని విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు.విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యత, సైన్స్ కు మానవునికి ఉన్న సంబంధాలను వివరించారు.పలు వర్కింగ్ ప్రాజెక్టులలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు.ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులలో పలు ప్రాజెక్టులను ఎంపిక చేసి, వాటిని రూపొందించిన విద్యార్థులను అభినందించి, ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిను ఎంపిక చేసి, విజేతలకు డైరెక్టర్ల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా రాజా, మహేశ్వరి,సుశీల,మస్తానీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి,రమ్య,చంద్రిక,సచిన్, సత్య,బినీత తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


6

శనివారం 01/మార్చ్/2025
www.viswamvoice.com

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


# ఘనంగా డిపిఆర్వో కాశయ్య పదవీ విరమణ వేడుక





**విశ్రాంత జీవనం ఆనందంగా గడపాలని పలువురు ఆకాంక్ష.**
**కాశయ్య దంపతులకు**
**కలెక్టర్ , జెసి , డిఆర్వో ,సిబ్బంది తదితరుల సత్కారం**





రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: ప్రభుత్వానికి, సమాచార సాధనాలకు మధ్య వారధిగా నిలిచి, ప్రజలకు సత్వర సమాచారం అందడంలో కీలక భూమిక పోషించి,అందరి మన్ననలూ అందుకున్న ఐకా కాశయ్య అభినందనీయులని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు, డిఆర్వో టి సీతారామ మూర్తి తదితరులు పేర్కొన్నారు.విశ్రాంత జీవనం నిండు నూరేళ్ల ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కాశయ్య పదవీ విరమణ సందర్భంగా స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలోని సర్వారాయ కళామందిరంలో సమాచార శాఖ సిబ్బంది శుక్రవారం అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. కలెక్టర్ పి ప్రశాంతి కాశయ్య దంపతులను క్యాంపు కార్యాలయంలో అభినందన తెలియచేస్తూసన్మానించారు. విధి నిర్వహణలో కాశయ్య చేసిన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. జిల్లా యంత్రాంగానికి పాత్రికేయ వర్గానికి వారధిగా విలువైన బాధ్యతలు నిర్వహించారని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు, డిఆర్వో టి సీతారామ మూర్తి పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్ధసారధి,గౌరవ అధ్యక్షుడు మండేలా శ్రీరామమూర్తి, పాత్రికేయులు వి ఎస్ ఎస్ కృష్ణకుమార్, కెవి శైలేంద్ర, అప్పలనాయుడు, జిల్లా పౌర సమాచార అధికారి సి. హెచ్ శ్రీనివాసు, డివిజనల్ పిఆర్వోలు లక్ష్మణా ఆచార్యులు, కుటుంబ సభ్యులు తదితరులు మాట్లాడుతూ విధి నిర్వహణలో కాశయ్యతో గల అనుబంధాన్ని ప్రస్తావించారు. రంపచోడవరం ఐటీడీఏ పబ్లిసిటీ సెల్ కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్ గా 1988 డిసెంబరు 12న విధుల్లో చేరిన కాశయ్య ఏలూరు డిపిఆర్ఓ కార్యాలయం లో ఉత్తమ సేవలందించారు. 2011 ఆగస్టు 11న ఆడియో విజువల్ సూపర్వైజర్ గా పదోన్నతి పొంది జిల్లాపౌర సంబంధాల అధికారి కార్యాలయం, మచిలీపట్నంలో బాధ్యతలు చేపట్టారు. డిసెంబర్ 2017 లో గుడివాడ డివిజన్ పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి అందుకుని డివిజనల్ పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సేవలందించారు. 2022 జనవరిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ జిల్లా పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి పొందారు. ఆతర్వాత జిల్లాల విభజనల ప్రక్రియలో రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటైన నూతన తూర్పుగోదావరి జిల్లా జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఏప్రిల్ 2022లో బాధ్యతలు చేపట్టి ఇప్పటి వరకు దిగ్విజయంగా అంకితభావంతో విధులు నిర్వర్తించి, వివాద రహితునిగా నిలిచారని పలువురు పేర్కొన్నారు. విశ్రాంత జీవనంలో ప్రశాంతంగా గడుపుతూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా కాశయ్య దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేశారు. పలువురు పాత్రికేయులు, సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది, బందు మిత్రులు పూలమాలలతో ముంచెత్తారు. విశ్రాంత డివిజనల్ పిఆర్వోలు అలీ, సాయిబాబా, అమలాపురం డివిజనల్ పీఆర్వో రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై అవగాహన కల్పించండి

**- శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నితిన్ రిమ్మలపూడి**



నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని రాజమండ్రికి చెందిన డెల్టా హాస్పిటల్ అధునాతన శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నితిన్ రిమ్మలపూడి అన్నారు.కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పియంపి అసోసియేషన్) తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పీఎస్వీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిడదవోలు హెూటల్ ఆనంద్ ఇన్ నందు క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెల్టా హాస్పిటల్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నితిన్ రిమ్మలపూడి మాట్లాడుతూ అధునాతన శస్త్రచికిత్స విధానాల గురించి, వెరికోసిస్, పైల్స్,హెమరాయిడ్స్ కు లేజర్ చికిత్స విధానం ద్వారా చేయడం గురించి వివరించారు. జీర్ణాశయానికి సంబంధించిన క్యాన్సర్స్ గురించి వివరించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ నేటి సమాజంలో జీవన శైలిలో మార్పులు, పర్యావరణ కాలుష్యం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు వలన ఎక్కువగా క్యాన్సర్ కు గురవుతున్నారని,క్యాన్సర్ ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం అని అన్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన వైద్య విధానాలపై అవగాహన కల్గి ప్రజలకు మేలైన వైద్య సేవలందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ, కోశాధికారి దాన శంకరం, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్,గోవిందరావు, పండు లతో పాటు సభ్యులు హాజరయ్యారు. అనంతరం వైద్యులను సభ్యులు సత్కరించారు.

# దివ్యాంగ పింఛన్దారులను తగ్గించడమే బాబు బ్రాండ్

**- వైయస్సార్సీపి దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు పోసికుమార్**



ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్: దివ్యాంగులకు పింఛన్లు పెంచామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదే మా బ్రాండ్ అని చెప్పటం విడ్డూరంగా ఉందని వైయస్సార్ సిపి దివ్యాంగుల విభాగం తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవైపు పింఛన్లు పెంచామని చెబుతూనే. మరోవైపు పింఛన్ తీసుకునే దివ్యాంగులను అనర్హత పేరుతో వారి సంఖ్య తగ్గించడమే బాబు బ్రాండ్ అని ఎద్దేవ చేశారు. నడవలేని ,చూపులేని,మానసిక స్థితి సరిగ్గా లేని,వారి వారి వైకల్యాన్ని మళ్లీ ధ్రువీకరించకోమని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వైద్య కేంద్రాల చుట్టూ తిప్పడమే మీ బ్రాండా బాబు అని ప్రశ్నించారు. సర్వే సాకుతో దివ్యాంగ పింఛలను కత్తిరించే ఎత్తుగడలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల ముందు వరకు దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారంతా అర్హులుగా కనిపించిన దివ్యాంగుల ఓటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనర్హులుగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలల గడుస్తున్న ఒక కొత్త దివ్యాంగ పింఛన్ కూడా మంజూరు చేయకపోవడం అనర్హత పేరుతో పింఛన్లు తొలగింపునకు శ్రీకారం చుట్టడం. బాబు బ్రాండ్ అని మండిపడ్డారు. వైకల్య ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేసే సదరన్ క్యాంపులను నిలుపుదల చేయటం. కూటమి ప్రభుత్వం ఘనతగా పోసి కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాలలో దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమం కోసం ఐదు శాతం రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు బడ్జెట్లో కేటాయింపు జరపాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని కుమార్ తెలిపారు.

# సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్

**ఎన్నికల హామీ నిలబెట్టుకోవడం అభినందనీయం..**
**బడ్జెట్ లో కేటాయింపులపై నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు హర్షం**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం అందించేలా రాష్ట్ర వార్షిక బడ్జెట్లో ప్రస్తావించడం పట్ల నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, రూరల్ బిజెపి కో కన్వీనర్ యానాపు ఏసు హర్షం వ్యక్తంచేసారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ గురించి బడ్జెట్లో కేటాయింపులు చేసి, హామీ నిలబెట్టుకున్నందుకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, ఎంపీ పురం దేశ్వరి తదితరులకు ఆయన కృత జ్ఞతలు తెలిపారు. ఉచిత విద్యుత్తు అమలుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో షాపులు ఉన్న నాయీ బ్రాహ్మణులకు ఈ పథకం వర్తిస్తుందని, అందుచేత షాపులు ఉన్నవారు కరెంట్ ఆఫీసులో అప్లై చేసుకోవాలని ఏసు సూచించారు. విద్యుత్ కార్యాలయంలో జె ఈ ని కల్సి ఈ విషయం ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. ఆధార్ కార్డు,రేషన్ కార్డు,కుల ధృవీకరణ పత్రం, ఆదాయపు ధ్రువపత్రం,లేబర్ సర్టిఫికెట్,ఫోన్ నం,కరెంట్ బిల్లు జిరాక్స్ తీసుకుని కరెంట్ ఆఫీస్ లో దరఖాస్తుతో పాటు అందజేయాలని అయన తెలిపారు.

## ఇంటర్ మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ ఎ వి సుబ్బరాజు




సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో ఉన్న కాలేజీని రేపటి నుంచి జరగబోయే ఇంటర్ ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో శనివారం అడిషనల్ ఎస్పీ ఎ వి సుబ్బరాజు పరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణలో ఈ ఎగ్జామ్స్ నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. విద్యార్థులు మాస్ కాఫీ రైటింగ్ వంటి వాటికి పాల్పడితే డీబార్ చేయడం జరుగుతుందని అన్నారు. సెల్ ఫోన్ అనుమతిలేదని పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్, పాన్ షాపులను నిర్వహించరాదని కాలేజీ యాజమాన్యానికి సూచించారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సిఐ సత్య కిషోర్,మండల ఎస్సై డి రామ్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కండి-జక్కంపూడి

**- ప్రభుత్వానికి కోతలే తప్ప,చేతలు లేవు.**
**-బడ్జెట్ కేటాయింపుల్లోనూ అన్ని కోతలే.**



కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: రాజానగరం మండలం కొండ గుంటూరు, సంపత్ నగరం గ్రామాల్లో "నా కార్యకర్తలు నా కుటుంబం" కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.శుక్రవారం కొండ గుంటూరు, సంపత్ నగరం గ్రామాల్లోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో మమేకమై ఎన్డీఏ ప్రభుత్వంలో వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కోతలే తప్ప, చేతలు లేవని శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో స్పష్టంగా తేటతెలమైందన్నారు. రాజా పార్టీ శ్రేణులతో విడివిడిగా చర్చలు జరిపి,పార్టీ బలోపేతం కోసం సమీక్షించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి నష్టం జరిగిందని,ఎన్నికల ముందు సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు,అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పించుకునే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వైసిపి నాయకులపై అక్రమ కేసులతో ప్రజల్లో అసంతృప్తులు బాగా పెరిగిందని, గ్రామాల్లో ప్రజలు అప్పుల పాలయ్యారన్నారు.ప్రజలకు భరోసాగా నిలవాలన్న ఉద్దేశంతోనే కార్యకర్తలు అందరిని సమాయత్తపరిచి ఎన్డీఏ ప్రభుత్వంలో జరిగే అవినీతి,అక్రమలు,ఇసుక,మట్టి, దోపిడీలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు, మహిళలకు ప్రతీనెలా 1,500 రూపాయల ఊసే లేదని, ప్రతీ నిరుద్యోగికి మూడువేల నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు తల్లికి వందనం, రైతులకు సుఖీభవ పథకాలలో బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసంచేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా శ్రేణులు పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఏపీ మహిళా అధ్యక్షురాలుగా ఖండవల్లి లక్ష్మి




రాజానగరం,విశ్వం వాయిస్ న్యూస్: ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఖండవల్లి లక్ష్మి నియమితురాలయ్యారు. విశాఖపట్టణంలో జరిగిన సంఘం కార్యకర్తలు సమావేశంలో ఈ మేరకు ఖండవల్లి లక్ష్మికి సంఘం జాతీయ కార్యదర్శి ఎం.శ్యామ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వరప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందచేశారు.ఈ సందర్భంగా ఖండవల్లిలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పదవికి పూర్తి న్యాయం చేస్తానని చెప్పారు.

# రాజమహేంద్రవరం డివిజన్లో రూ. 27.93 కోట్ల ఇంటి పన్నుల వసూళ్లు

**- నూరు శాతం పన్నుల వసూళ్ళుకు ఆదేశాలు**
**- డిఎల్పీవో ఎమ్. నాగలత**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గల గ్రామ పంచాయతీలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ. 27.93 కోట్లు ఇంటి పన్నులు వసూళ్లు చేసినట్లు డివిజన్ పంచాయతీ అధికారిణి ఎం. నాగలత తెలిపారు. కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంక గ్రామపంచాయతీలలో శుక్రవారం ఆమె పర్యటించి పలు పిర్యాదులపై విచారణ చేసారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో గల రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాలలో 146 గ్రామ పంచాయతీలు రూ.67.58 కోట్లు ఇంటి పన్నులు వసూలు చేయవలసి ఉందన్నారు. ఇప్పటికి 41 శాతం వసూలు చేయగా నూరు శాతం వసూళ్ళకు సంబంధిత గ్రామ కార్యదర్శిలకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఇంకా రూ.39.65 కోట్లు ఇంటి పన్నులు వసూళ్ళు కావలసి ఉందన్నారు. మార్చి 15 నాటికి నూరు శాతం పన్నుల వసూళ్ళుకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంటి యజమానులు కూడా పన్నుల చెల్లింపులకు సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా తడి పొడి చెత్త సేకరణకు ముమ్మర చర్యలు చేపడు తున్నా మన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి ఇంటింటికీ అవగాహన కల్పించడానికి అన్ని శాఖల అధికారులు, ఉద్యో గులు, సిబ్బంది కృషి చేస్తున్నట్లు డిఎల్పీవొ నాగలత వివరించారు. డివిజన్ పరిధిలో 146 గ్రామ పంచా యతీలకు గాను 111 పంచాయతీలలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహించబ డుతున్నా యన్నారు. మిగిలిన పంచాయతీలలో షెడ్లు నిర్మా ణాలు వేగంగా జరుగుతున్నట్లు డిఎల్పీవొ నాగలత తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.వి. రాంప్రసాద్, జేగురుపాడు, పొట్టిలంక గ్రామ కార్య దర్శులు ఎ.శ్రీనివాసరావు, అమీర్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

# క్రిమినల్ కేసులలో ముద్దాయిపై పి.డి యాక్ట్ అమలు

**- తూర్పుగోదావరి జిల్లా 2టౌన్ పోలీసు**
**- జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు.**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగర పరిధి ఆల్కాట్ గార్డెన్స్ లో గల యర్రా గణేష్ అలియాస్ గంజి గాడు అల్కాట్ గార్డెన్స్ రాజమహేంద్రవరం,తూర్పు గోదావరి జిల్లా అను వ్యక్తి ప్రమాదకర నేరస్తుడై ఉండి మరియు అతను వివిధ రకాల నేరములలో అనగా డెకోయిటీ, దోపిడీ మరియు నార్కోటిక్ డ్రగ్స్ (గంజా) మరియు ఎక్స్ టోర్షన్, ఎస్సీ.ఎస్టీ, అనేక సంఘ వ్యతిరేక నేరాలను చేసిఉన్నాడు. ఇతను తను నివసించు ప్రదేశములో ఒక ప్రమాదకర వ్యక్తిగా చలామణి అవుతూ, అక్కడ నివసించు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసు న్నాడు. ఇతను 15 క్రిమినల్ కేసులలో ముద్దాయి గా ఉన్నాడు.సదరు విషయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ సదరు ముద్దాయిని చాలాసార్లు మంచి ప్రవర్తన కలిగి ఉండమని కౌన్సెలింగ్ ఇచ్చిము, అయినా అతని వైఖరి మార్చుకోకుండా, నేరాలకు, అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఇతనిపై పి.డి యాక్ట్ (నిర్బందించుటకు ఉత్తర్వులు) నమోదు చేయుట అవసరం ఉన్నందున డి ఎస్ పి భవ్య కిషోర్ ,దక్షిణ మండలం వారి ఆధ్వరంలో, 2 టౌన్ ఇన్స్ స్పెక్టర్ సదరు ముద్దయిపై ప్రమాదకర కార్యకలాపముల నిరోధక చట్టం, 1986 (యాక్టు 1,1986) లోని సెక్షన్ 2(జీ) ప్రకారము పీడీ యాక్ట్ (నిర్బందించుటకు ఉత్తర్వులు) ప్రతిపాదనలు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీకి పంపగా, కావున, ఎవరైనా,ఏవైనా దౌర్జన్యాలకు పాల్పడినట్లయితే సహించేది లేదని, అట్టి వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం- రమతి



కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జ్ ప్రిన్సిపల్ రమతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుండి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, బెంచీలు, పోలీస్ బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షకు 10 నిమిషాలు ముందుగానే హాజరు కావాలని, సమయం దాటితే లోపల అనుమతించేది లేదన్నారు. సుమారు 590 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు వ్రాయునట్లు ఆమె తెలిపారు.

## పిడిఎఫ్ అభ్యర్థి తరపున ప్రచారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కి ధన్యవాదములు-కూనవరం మండల సిపిఎం పార్టీ



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలంలో మండల కమిటీ MLC ఎన్నికలో పాల్గొని పనిచేసిన మండల కమిటీ సభ్యులకు ,జిల్లా నాయకులకు, ప్రజాప్రతి నిధులకు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాబు బో్రయ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈనెల27 తేదీన జరిగిన MLC ఎన్నికలో PDF అభ్యర్థి దిడ్ల వీర రాఘువులు గెలుపే లక్ష్యంగా చేసుకుని ఉదయం 6. గంటల నుండి సాయంత్రం 4గంటల వరకుప్రతి గ్రేడ్యువెట్ ఓటర్లందరు ఎన్నికలో పాల్గోని తమ అమూల్యమైన ఓటును ప్రజల పక్షాన నిలబడి మాట్లాడే వ్యక్తికి PDF అభ్యర్థి దిడ్ల వీర రాఘవులకు ఓటు వేసిన కూనవరం మండల గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరికీ కూనవరం మండలం సిపిఎం పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ఈMLC ఎన్నికలకు సహకరించిన అన్ని పార్టీ నాయకులకు ప్రజా సంఘాల నాయకులకు మరొకసారి అభినందనలు తెలియపరుస్తున్నాం. ఈ ఎన్నికలు ఇంత ప్రశాంతంగా జరగడానికి ముఖ్యం కారణం పోలీసు అధికారులు కూడా మా ప్రత్యేక ధన్యవాదాలు

## గోదావరిలో నీట మునిగి ఇద్దరు యువకులు మృతి

**- దైవ దర్శనానికి వచ్చి అనంత లోకాలకు...! - యువకుల మృతితో కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు**



**ఎటపాక / భద్రాచలం , విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ , వికారాబాద్ కు చెందిన ఇద్దరు యువకులు వారి కుటుంబంతో శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి నదిలో దిగిన యువకులకు నది లోతు అంచనా తెలియక స్నాన ఘట్టాలకు సమీపంలోని గోదావరి నది ప్రవాహంలో గల్లంతయ్యారు. అప్రమత్తమైన గజ ఈతగాళ్ళ బృందం నదిలో గాలించి యువకులను ఒడ్డుకు చేర్చగా అప్పటికే వారు మృతి చెందారు. మృతులు పవన్ (20), హరిప్రసాద్ (18)గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం





**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఫిజిక్స్ విభాగం అధ్వర్యంలో నిర్వహించిన్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ముల్లి శేఖర్ మాట్లాడుతూ సి.వి రామన్ యావత్ భారత దేశం గర్వపడే విధంగా రామన్ ఎఫెక్ట్ సిద్ధాం తాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ సిద్ధాంతం వలన శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ నేడు భారత్ అత్యున్నత స్థాయికి చేరిందన్నారు. కృషి పట్టుదల సునిషిత పరిశీలన,ఏదైనా సాదించాలి అనే పట్టుదల ఉన్నప్పుడే యువత సైన్స్ రంగంలో ముందుకు వెళ్ళగలుగుతుందన్నారు. ఫిజిక్స్ అధ్యా పకులు యం.నాగ మోహన్ రావు మాట్లా డుతూ సి.వి.రామన్ ఆలోచన విధానం ద్వారా నేడు మనదేశానికి నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు వచ్చాయనీ తెలిపారు. అర్థశాస్త్రం విభాగాధిపతి జి.వెంకటరావు మాట్లాడుతూ కేవలం 200 రూపాయులు ఖర్చుతో నోబెల్ బహుమతి పొందిన గోప్ప శాస్త్ర వేత్త సీ.వి.రామన్ నని కోనియడారు. బోటని అధ్యాపకురాలు డాక్టర్ వై పద్మ మాట్లాడుతూ రామన్ గారిని ఆదర్శంగా తీసుకోని విద్యార్థులు ముందుకు వెళ్ళాలన్నారు. కం ప్యూటర్ అధ్యాపకులు నూనె రమేష్ మాట్లాడుతూ సైన్స్, ప్రకృతిని అనుసం ధానం చేసుకుంటూ నేటి యువత క్రొత్త క్రొత్త ఆవిష్కరణలు చెయ్యాలాన్నారు. ఈకార్యక్ర మంలో అధ్యాపకులు జి. హారతి, యస్. అప్పనమ్మ , కె శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, జి. సాయికుమార్, రాజబాబు, బి.శ్రీనివాసరావు తది తర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ల పాల్గొన్నారు.

## ఒకటవ తేదీన జరగవలసిన పోలవరం గ్రామసభలు వాయిదా



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో మార్చి 1 తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన పోలవరం నిర్వాసిత గ్రామసభలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. మార్చి ఒకటవ తేదీ , 2025 నాడు జరగవలసిన పోలవరం భూ సేకరణ మరియు %=ɑ=% గ్రామ సభలు వాయిదా వేయటం జరిగినది అని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ధవళేశ్వరం వారు తెల్పిన్నారు. ఈ గ్రామసభలు కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయటం జరిగినది అని పేర్కొన్నారు. తదుపరి గ్రామసభ తేదీలు త్వరలోనే ప్రకటించి గ్రామసభలు నిర్వహించడం జరుగుతుంది అని చెప్పినారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు

**- భద్రాద్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో**



**ఎటపాక / భద్రాచలం , విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు శుక్రవారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అధ్యక్షతన సైన్స్ విభాగం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హావిలా , నోబుల్ గ్రహీత సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ హవిలా మాట్లాడుతూ సి.వి.రామన్ ఆయన కాంతి పైన చేసిన పరిశోధన ద్వారా 1930 సంవత్సరంలో నోబుల్ బహుమతి వచ్చిందని విద్యార్థులకు తెలియజేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రంగోలి, వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు , విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూరిభా పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** చింతూరు కస్తూరిబా బాలికల పాఠశాల లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ విభాగం అధ్వర్యంలో నిర్వహించిన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలియజేసారు. ఈ కార్యక్రమం లో రమాదేవి మాట్లాడుతూ సి.వి రామన్ యావత్ భారత దేశం గర్వపడే విధంగా రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ సిద్ధాంతం వలన శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ నేడు భారత్ అత్యున్నత స్థాయికి చేరిందన్నారు. కృషి పట్టుదల సునిషిత పరిశీలన,ఏదైనా సాది ంచాలి అనే పట్టుదల ఉన్నప్పుడే యువత సైన్స్ రంగంలో ముందుకు వెళ్ళగలుగుతుందన్నారు. ఫిజిక్స్ మరియు జీవశాస్త్రం ఉపాధ్యాయిని లు కృష్ణవేణి, డి.రాములమ్మ లు మాట్లాడుతూ సి.వి. రామన్ ఆలోచన విధానం ద్వారా నేడు మనదేశానికి నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు వచ్చాయనీ తెలిపారు. కేవలం 200రూపాయులు ఖర్చుతో నోబెల్ బహుమతి పొందిన గోప్ప శాస్త్ర వేత్త సీ.వి.రామన్ నని కోనియడారు.మాట్లాడుతూ రామన్ గారిని ఆదర్శంగా తీసుకోని విద్యార్థులు ముందుకు వెళ్ళాలన్నారు. సైన్స్ మరియు ప్రకృతిని అనుసంధానం చేసుకుంటూ నేటి యువత క్రొత్త క్రొత్త ఆవిష్కరణలు చెయ్యాలాన్నారు. ఈకార్యక్ర మంలో ఉపాధ్యాయిని లు కృష్ణవేణి,రాములమ్మ, జ్యోతి, గౌతమి, రమణి,రాములమ్మ, సంధ్య, లిల్లి, భవాని, దుర్గాభవాని అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ల పాల్గొన్నారు.

## మంచి ప్రగతి సాధించడానికి విజ్ఞాన ప్రదర్శన విద్యార్థులకు ముఖ్యం

**- ఘనంగా శ్రీచైతన్య విజ్ఞాన ప్రదర్శనలు..**

**- విద్యార్థులను అభినందించిన ఏఎస్పీ మురళీకృష్ణ**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి మోరంపూడి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బ్రాంచ్ నందు సైన్స్ డే సందర్భంగా విద్యార్థిని విద్యార్థులచే వివిధ రకాల విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ ఎన్ వి ఎం మురళీకృష్ణ పాల్గొని వారు తయారు చేసిన నమూనాలను పరిశీలించి విద్యా ర్థులను అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యా లను మెరుగుపరచడానికి ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని భావితరాల భవిష్యత్తుకు దేశ ప్రగతికి ఉపయోగపడ తాయని బ్రాంచ్ నందు సివిల్స్ బ్రాంచ్ ఏర్పాటు చేసి భవిష్య త్తులో విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఒక మంచి ఆలోచనతో రాజకీయ సామాజిక చైతన్యం సమాజం పట్ల అవగాహన విజ్ఞానం సాంకేతిక నైపుణ్యం చరిత్ర ఎన్నో ఉపయో గకరమైన విషయాలు పిల్లలకు నేర్పిస్తూ భవిష్యత్తులో ప్రతిభను కనపరిచే విధంగా మార్గ నిర్దేశం చేస్తున్న యాజమాన్యాన్ని సిబ్బందిని ఏఎస్పీ మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు భవి ష్యత్తులో ఇటు వంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో పిల్లలకు మంచి అవగాహన నేర్పించాలని ఆయన సూచించారు. రీజినల్ ఇన్చార్జి ఉదయ శంకర్ మాట్లాడుతూ దేశ ప్రగతికి మూల స్తంభాలైన నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులుగా మంచి ప్రగతి సాధించడానికి ప్రతి ఒక్క విజ్ఞాన ప్రదర్శన ఎంతో చక్కగా నిర్వహించారని భవిష్య త్తులో ఇటువంటి ప్రదర్శనలు వినూత్నంగా నిర్వ హిం చాలని విద్యార్థులను ప్రోత్సహించారు. శ్రీ చైతన్య మోరంపూడి బ్రాంచ్ నందు ఇంత మంచి కార్యక్ర మం నిర్వహించినందుకు విద్యార్థులను వారికి సహకరించిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందానికి ఏజీఎం సురేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సివిల్స్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ లక్ష్మీ సౌజన్య, కోఆర్డినేటర్ లు అరుణ్ కుమార్, శిరీష, ఇంచార్జ్ షణ్ముఖ,నవ్య తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లిపాకలో ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ టైలర్స్‌డే వేడుకలను శుక్రవారం టైలర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ ఘనంగా నిర్వ హించారు. మండల పరిధిలోని నెల్లిపాక ప్రధాన కూడలిలో ముందుగా జెండా ఆవిష్కరణ చేసి కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్ హౌవే చిత్రపటానికి టైలర్స్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు మాట్లాడుతూ స్వయం ఉపాధి మీద జీవనం సాగించే టైలర్స్ ఏకతాటిపై పోరాటాలు సాగించినపుడే ప్రభుత్వం పరంగా సంక్షేమ పథకాలను అందుకునే అవకాశం ఉందని తెలి పారు. అసోసియేషన్ అధ్యక్షులు హిమామ్ మాట్లాడుతూ రోజురోజుకు పెరిగి పోతున్న రేడిమేడ్ రంగం ప్రభావంతో టైలర్స్, దీనిపై ఆధారపడి జీవిం చే అనేక కుటుంబాల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు.

దర్జీ వృత్తిదారుల స్థితిగతులను గుర్తించి గత ప్రభుత్వంలో దర్జీలకు రుణాలు మంజూరు చేసిన విధంగా నేటి ప్రభుత్వం కూడా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ కార్యదర్శి కాసులు, బూదుకూరి వెంక టేశ్వరరావు, వల్లాల చంద్రశేఖర్, లక్ష్మి, సౌజన్య, సలీమా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు ఏర్పాటు చేసిన డా జమాల్ ఖాన్

**కాపుగొంపల్లిలో జెకెసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు**

**ట్రస్ట్ చైర్మన్ డా.జమాల్ ఖాన్ కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**




ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ : మండలంలోని గన్నవరం పంచాయతీ కాపుగొంపల్లిలో శుక్రవారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. వేసవికాలంలో నీటి ఎద్దడి ఉన్నందున మంచినీటి బోరు కావాలని జెకెసి ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డా.జమాల్ ఖాన్ ను కాపుగొంపల్లి కాలనీవాసులు కోరగా ఆయన సహృదయంతో స్పందించి బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా.జమాల్ ఖాన్ మాట్లాడుతూ తాగునీటి బోరును సద్వినియోగం చేసుకోవాలని, తాగునీటి బోరు మరమ్మతులకు గురికాకుండా అందరికీ ఉపయోగపడేలా చూసుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ఉపయోగపడే బోరు వద్ద పరిశుభ్రత పాటించాలని కోరారు. తమ అభ్యర్థన మేరకు ఇచ్చిన మాట ప్రకారం బోరును ఏర్పాటు చేసిన డాక్టర్ జమాల్ ఖాన్ కి స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, బొల్లా పుల్లయ్య, ఏపూరి వెంకన్న, కణితి మధు, దానే రాజు, ఎస్కే షాజహాన్, మందలపు సత్యనారాయణ, పాయం మాధవరావు, తోట వెంకటేశ్వరరావు, పరసిక నారాయణ, గొంది రాంబాబు, పాయం నాగరాజు, కొర్స రాంబాబు, గొంది రవి, ఎం శ్రీకాంత్, మాచినేని బద్రీనాథ్, పి సుమన్, గొంది బాలరాజు, పణి రాజు ఎ నాగేంద్ర, కె రామకృష్ణ, ఎం రమేష్, మొరంపల్లి నాగేష్, బుడగం హనుమంతు, పులి సుమన్, జెకెసి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నదీ జలాలను పరిరక్షించేందుకు ప్రజలు భాగస్వామ్యులు కావాలి

**- రాజమండ్రి మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మనిషి జీవనానికి అత్యవసరమైన నీటిని వృధా కానివ్వకుండా పరిరక్షించు కోవాలని భవిష్యత్తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి జరిగే కృషిలో ప్రజలందరు భాగస్వామ్యులు కావాలని కమిషనరు కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. కేంద్ర జలవనరుల శాఖ జలశక్తి విభాగం,నదీ జలాల పరిరక్షణ సంస్థ సూచనల మేరకు శు క్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పుష్కరఘాట్ వేదికగా వివిధ కార్యక్రమాలు చేపట్టుట జరిగినది. ది.25-02-2025 వ తేది హై స్కూలు స్థాయిలో జలసంరక్షణపై అవగాహన కల్పించు నిమిత్తం నగరపాలక సంస్థకు చెందిన పదమూడు (13) ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలు జరిగాయి. అందులో విజేతలైన ముగ్గురు విద్యార్థులలో మొదటి బహుమతి విజేతగా యు.ప్రశాంత్, 10వ తరగతి, గాంధీపురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, రెండవ బహుమతి విజేతగా ఎ.ప్రియదర్శిణి, 9వ తరగతి, నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, మూడవ బహుమతి విజేతగా ఎ.సంధ్య వినయణి, 9వ తరగతి, ఎస్.కె.ఆర్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల బహుమతి ప్రధానంతో పాటు, పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందచేసి , సత్కరించారు. తొలుత ఉదయము గం.6:00 నుండి 8:00 వరకు యోగా కార్యక్రమం చేపట్టారు. పలు యోగా సంస్థల సభ్యులు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ నదీజలాలను కలుషితం కాకుండా ప్రజలు సహకరించాలని, ప్రభుత్వం నీటిశుద్ధి కొరకు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని గతంలో 30 ఎం.ఎల్.డి. సామర్థ్యంతో నిర్మించడం జరిగిందని, పెరుగుతున్న జనాభా దృష్ట్యా అదనంగా రూ.95.00 కోట్లతో 50.60 ఎం.ఎల్.డి. సామర్థ్యంతో జాతీయ నదీ సంరక్షణ సంస్థ నిధులతో చేపట్టామని, ఈ సంవత్సరములో సదరు కేంద్రం పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే యోగా శరీర శుద్ధికి చాలా ఉపయోగ పడుతుందని, అందరూ యోగా చేయాలని తద్వారా మానసిక వత్తిడి శరీర ఆరోగ్యం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తదుపరి పుష్కర్ ఘాట్ నందు బోట్ రేస్ ఏర్పాటు చేసిన బోట్ రేసును జండా ఊపి ప్రారంభించారు. నగరంలో మత్స్యకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచినటువంటి శ్రీ నాతి పోసయ్య రూ.25000/-లు, మల్లాడి సుబ్బన్న రూ.15000/-లు మరియు పోతాబత్తుల నాగరాజు రూ.10000/-లు బహుమతులు అందచేసారు. ఉదయం గం.8:00 నుండి 10:00 వరకు కాస్మోపాలిటన్ క్లబ్ పై మ్యూరల్ పెయింట్ వేయడం జరిగింది. నదీ జలాలు మరియు జలచరాల పరిరక్షణ అంశముపై పెయింటింగు కార్యక్రమము నిర్వహించడమైనదని పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు. అలాగే సాయంత్రం గం.5:00 లకు వివిధ వర్గాల విద్యార్థులు, ప్రజలు, కార్యదర్శులు నీటి సంరక్షణ ఆవశ్యకత తెలియచేస్తూ ప్లకార్డు, నినాదాలతో ఊరేగింపు జరిగింది. అనంతరము సాంస్కృతిక కార్యక్రమాలు విజేతలకు బహుమతి ప్రధానం కార్యక్రమాలు నిర్వహించడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పి వి రామలింగేశ్వర్, డిప్యూటి కమిషనరు ఎస్ వెంకటరమణ, మున్సిపల్ ఆరోగ్య అధికారిణి డా.ఎ.వినూత్న,ఎగ్జిక్యూటివ్ యింజనీర్ మదర్షా ఆలీ, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్ అస్ఫర్, కమాండ్ కంట్రోల్ రూం హెడ్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో అర్చకునిపై భక్తుడు విరంగం

**- లింగధ్బోవ సమయంలో జాంపేట ఉమారామలింగేశ్వర ఆలయంలో.**



**రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్:** దక్షిణ కాశీగా భాసిల్లే పవిత్ర గోదావరి తీరం రాజమండ్రి జాంపేట ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి రోజున..లింగోద్భవ సమయంలో భక్తుడు వీరంగం చేశారు. ఆలయంలో స్వామి వారి దర్శనం కోసం వందల సంఖ్యలోనే భక్తులు వేచి ఉన్నారు. క్రమశిక్షణ పాటిస్తూ..ఓర్పుతో ..సహనంతో...భక్తితో ఆలయప్రాంగణంలో మరోక భక్తునికి ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా వ్యవహరించాల్సి కొందరు భక్తులు రావలసిన మార్గం నుంచి కాకుండా మరో మార్గంలో అపసవ్య దిశలో దర్శనానికి వచ్చేస్తున్నారు. రెండువైపుల నుంచి భక్తుల ముందుకు రావడంతో ఎటూ కదలలేని పరిస్థితి ఎదురయింది. దర్శనం కావడం లేదు. భక్తుల బయిటకు వెళ్ళే దారి లేదు. ఇంతలో అక్కడ ఉన్న అర్చకులు ఇది గమనించి భక్తులు క్రమశిక్షణలో ఒక మార్గం నుంచి కాకుండా ఎదురెదురుగా వస్తున్నారు తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా అయితే దర్శనం కష్టమని..విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా నేను ఇలానే వస్తున్నా అని ఓ భక్తుడు వాదన ప్రారంభించారు. ఇది సమంజసం కాదని నచ్చజెప్పడానికి ప్రయత్నించిన వారి పై కూడా సదరు భక్తిపరాయణులు తీవ్ర స్వరంలో గద్దించి మీరు ఎవరు..చెప్పడానికి ..అవతలకి పోండని అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో సంబందిత అధికారులు అక్కడకు చేరుకున్నారు. అయినప్పటికీ సమస్యపరిష్కారం కాలేదు. పలువురు భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆలయానికి వచ్చే భక్తులు కొందరు క్యూలైనులో రాకుండా తాము ప్రత్యేక అర్హత కలిగిన వారమని బాధ్యాతా రాహిత్యంగా ..క్రమశిక్షణ పాటించక పోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సామాన్య భక్తులకు దర్శనం అనేది దూరం కావడానికి.. గంటలు తరబడి క్యూలైన్లలో పడిగాపులు పడటానికి కొందరి అనుచిత ప్రవర్తనే అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భగవంతుని ముందు అందరూ సమానులు కాదని బలవంతులు బలహీనులను దూరమయ్యేలా చేస్తున్నారని పలువురు భక్తులు వాపోతున్నారు.

సినీ వాయిస్ CINEMA

# పవర్‌ఫుల్ టైటిల్‌ను పట్టేసిన కళ్యాణ్ రామ్!



కళ్యాణ్ రామ్‌చాలా డిఫరెంట్‌గా మేకోవర్ అయినట్టు తెలుస్తోంది. డెవిల్ మూవీతో హిట్ అందుకున్న నందమూరి కళ్యాణ్ రామ్ నుంచి ఇప్పటివరకు మరో సినిమా రాలేదు. దీంతో కళ్యాణ్ రామ్ నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం నందమూరి ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. కళ్యాణ్ రామ్ ప్రస్తుతం ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ సినిమాను చేస్తున్న విషయం తెలిసిందే. అశోక్ క్రియేషన్స్ బ్యానర్ లో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముప్పా వెంకయ్య చౌదరి ప్రెజెంటర్ గా వ్యవహరిస్తున్నాడు. కళ్యాణ్ రామ్ కెరీర్లోనే హయ్యెస్ట్ బడ్జెట్ తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమా కోసం కళ్యాణ్ రామ్ చాలా డిఫరెంట్ గా మేకోవర్ అయినట్టు తెలుస్తోంది. హై ఓల్టేజ్ యాక్షన్ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాకు ముందుగా మెరుపు అనే టైటిల్ ను ఫిక్స్ చేశారని వార్తలొచ్చాయి. కానీ ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మరో పవర్‌ఫుల్ టైటిల్ ను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. కథకు రుద్ర అనే టైటిల్ అయితే సరిగ్గా సరిపోతుందని మేకర్స్ ఆ టైటిల్ ను ఫిక్స్ చేయాలని చూస్తున్నారట. ఈ సినిమాతో అలనాటి తార విజయశాంతి పవర్‌ఫుల్ లేడీ పోలీసాఫీసర్ రోల్ ద్వారా గ్రాండ్ రీ ఎంట్రీ ఇవ్వనున్నట్టు ఇప్పటికే చిన్న గ్లింప్స్ ద్వారా తెలిపారు. ఆమెతో పాటూ సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఆడియన్స్ కు మంచి అంచనాలున్నాయి.

# జలపాతంలో మాళవిక అందం..!

కేరళ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ 2013లో 'పట్టం పోల్' అనే మలయాళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. కేరళ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ 2013లో 'పట్టం పోల్' అనే మలయాళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. నటిగా కెరీర్ ఆరంభంలో కాస్త ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ముఖ్యంగా తమిళ్‌లో ఈమె నటించిన సినిమాలకు మంచి స్పందన వచ్చింది. తమిళనాట స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఈ అమ్మడు నిలిచింది. రజనీకాంత్, విజయ్ వంటి స్టార్ హీరోలతో తమిళనాట సినిమాలు చేసిన మాళవిక మోహనన్ టాలీవుడ్‌లో మాత్రం ఇప్పటి వరకు కనిపించలేదు. ఎట్టకేలకు ప్రభాస్ రాజాసాబ్ సినిమాలో ఈ అమ్మడు నటిస్తోంది. మాళవిక మోహనన్ ప్రస్తుతం చేస్తున్న రాజాసాబ్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన పదేళ్ల తర్వాత టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతున్న ఈ ముద్దుగుమ్మకు మంచి ఫ్యూచర్ ఉంటుంది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ వంటి పాన్ ఇండియా స్టార్ సినిమాలో నటించడం ద్వారా కచ్చితంగా ఈమెకు వరుసగా ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేయడంతో పాటు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఫాలోవర్స్‌కి కన్నుల విందు చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఫాలోవర్స్‌ని ఆకట్టుకునే ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా అందగత్తెలు రెడ్ కలర్ డ్రెస్ ధరిస్తే మరింత అందంగా కనిపిస్తారు అంటారు. మాళవిక మోహనన్ రెడ్ డ్రెస్‌లో నడుము అందం చూపిస్తూ, నాభి అందాన్ని చూపిస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు చూపు తిప్పనివ్వడం లేదు. మాళవిక వెనుక అందమైన జలపాతం ఉంది. ఆ జలపాతం అందాన్ని బీట్ చేసే విధంగా మాళవిక రెడ్ డ్రెస్ అందం ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. లాంగ్ షాట్‌తో పాటు, క్లోజప్‌లోనూ మాళవిక మోహన్ చాలా అందంగా ఈ డ్రెస్‌లో కనిపిస్తుందని, జలపాతం అందాన్ని డామినేట్ చేసే విధంగా మాళవిక ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# డీ గ్లామర్ బ్యూటీగా బుట్టబొమ్మ!



రాఘవ లారెన్స్ స్వీయా దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కాంచన 4లో పూజాహెగ్డే ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఆమె పాత్ర ఎలాంటిది అన్నది ఇంత వరకూ క్లారిటీ రాలేదు. ఇప్పటి వరకూ పూజా హెగ్డే వెండి తెరపై అందమైన బ్యూటీగానే హైలైట్ అయింది. ప్రియురాలు, ప్రేమికురాలి పాత్రల్లో తెరపై ఎంతో అందంగా కనిపించింది. అయితే తొలిసారి డీగ్లామర్ పాత్రకు సై అనేసింది. రాఘవ లారెన్స్ స్వీయా దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కాంచన 4లో పూజాహెగ్డే ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఆమె పాత్ర ఎలాంటిది అన్నది ఇంత వరకూ క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో పూజా హెగ్డే డీగ్లామర్ పాత్రలో కనిపించనుందని సమాచారం. అమ్మడు సినిమాలో ఎక్కడా మ్యాకప్ లేకుండానే కనిపిస్తుందట. బాగా వెనుకబడిన పల్లెటూరి అమ్మాయి పాత్రలో మాస్ కోణంలో పూజా హెగ్డే రోల్ ఉంటుందట. గంగ చిత్రంలో నిత్యామీనన్ కంటే మరింత డీగ్లామర్ గా పూజాహెగ్డే పాత్ర ఉంటుందని అంటున్నారు. డీగ్లామర్ పాత్రల్లో పూజా హెగ్డే ఇంతవరకూ ఏ సినిమాలో నటించలేదు. అలాంటి ఆహార్యానికి కూడా ఎక్కడా ఛాన్స్ తీసుకోలేదు. ఆన్ ది స్క్రీన్ ఆఫ్ ది స్క్రీన్ లో ఎప్పుడూ మోడ్రన్ గానే కనిపించింది. అలాంటి నటి తొలిసారి డీగ్లామర్ పాత్ర పోషించడం అంటే ఓరకంగా ఇది అమ్మడికిది పెద్ద సవాల్ అనే చెప్పాలి. ప్రస్తుతం ఈ సినిమా సెట్స్ లో ఉంది. ఇందులో నోరా పటేహీ కూడా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె పాత్ర కూడా బలంగా ఉంటుందని సమాచారం.



# అకీరాను లాంచ్ చేసేది రామ్ చరణ్!

ఇప్పటికే అకీరాను వెంట తిప్పుకుని పవన్ కళ్యాణ్ తన వారసుడిగా హైలైట్ చేసిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియాలోనే అకీరాని పరిచయం చేసాడు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వారసుడు అకీరా నందన్ తెరంగేట్రానికి ఏర్పాట్లు మొదలయ్యాయా? అన్ని అనుకున్నట్లు జరిగితే ఇదే ఏడాది? లేదా వచ్చే ఏడాది షురూ చేయబోతున్నారా? అంటే అవుననే సమాచారం మెగాకాంపౌండ్ వర్గాల నుంచి బలంగా వినిపిస్తుంది. ఇప్పటికే అకీరాను వెంట తిప్పుకుని పవన్ కళ్యాణ్ తన వారసుడిగా హైలైట్ చేసిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియాలోనే అకీరాని పరిచయం చేసాడు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి ఇంటర్ డ్యూస్ చేయడం..అంతకు ముందు ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆశీస్సులు ఇప్పించడం ఇవన్నీ కూడా అకీరా ఎంట్రీకి సంబంధించిన సంకేతాలుగానే నెట్టింట వైరల్ అయ్యాయి. అయితే తాజాగా లాంచింగ్ పనులు వేగవంతమైనట్లు తెలుస్తోంది. అకీరాను లాంచ్ చేసే బాధ్యతలు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తీసుకున్నాడని సన్నిహితుల సమాచారం. పవన్ కళ్యాణ్ ఆ బాధ్యతలు తనకే అప్పగించినట్లు వినిపిస్తుంది. స్టోరీ సెలక్షన్, డైరెక్టర్ ఎంపిక ఇలా ప్రతీది మొదటి ఫేజ్ లో రామ్ చరణ్ చూస్తాడట. అటుపై మెగాస్టార్ చిరంజీవికి రిఫర్ చేస్తారట. వాళ్లిద్దరి స్క్రీనింగ్ పూర్తయిన తర్వాత చివరిగా పవన్ ముందుకు స్టోరీ వెళ్తుందని సన్నిహితుల నుంచి అందుతోన్న సమచారం. అన్నయ్య, అబ్బాయ్ మాటలను పవన్ ఎలాగూ కాదనడు. సినిమా నాలెడ్జ్ తనకంటే ఎక్కువగా వాళ్లిద్దరికే ఉందని నమ్మే వ్యక్తి పవన్. పైగా తాను ఉన్న బిజీలో పవన్ ఎలాగూ తనయుడి కెరీర్ విషయంలో శ్రద్ధ తీసుకోలేదు. అంత సమయాన్ని కేటాయించలేని పరిస్థితి. ఇవన్నీ ఆలోచించుకునే అకీరాని చరణ్ చేతుల్లో పెట్టినట్లు కనిపిస్తుంది. రామ్‌చరణ్ కు తల్లి రేణు దేశాయ్ టచ్‌లో ఉన్నారట. తనయుడి విషయంలో అన్ని అప్ డేట్స్ అడిగి తెలుసుకుంటున్నారని తెలిసింది.

## మూవీ రివ్యూ

# 'శబ్దం'



'శబ్దం' మూవీ రివ్యూ
నటీనటులు: ఆది పినిశెట్టి-లక్ష్మి మేనన్-సిమ్రన్-లైలా-ఎం.ఎస్.భాస్కర్-రెడిన్ కింగ్స్ లీ తదితరులు సంగీతం: తమన్ ఛాయాగ్రహణం: అరుణ్ పద్మనాభన్ నిర్మాతలు: శివ- భానుప్రియ శివ రచన-దర్శకత్వం: అరివళగన్ ఓవైపు విలన్-క్యారెక్టర్ రోల్స్ చేస్తూనే.. అప్పుడప్పుడూ హీరోగానూ మంచి మంచి సినిమాలు చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటూ ఉంటాడు తెలుగువాడైన తమిళ హీరో ఆది పినిశెట్టి. తన కెరీర్లో చాలా ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ 'వైశాలి' సినిమాను రూపొందించిన అరివళగన్‌తో అతను మళ్లీ ఒకటిన్నర దశాబ్దం తర్వాత కలిసి చేసిన సినిమా.. శబ్దం. ఇంట్రెస్టింగ్ ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో అంచనాలను పెంచిన ఈ చిత్రం.. ఆ అంచనాలను ఏమేర అందుకుందో చూద్దాం పదండి.

**కథ:** కేరళలోని మున్నార్ లో ఒక మెడికల్ కాలేజీలో ఒక జంట అనుమానాస్పద రీతిలో ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. వీరి స్నేహితురాలైన మరో అమ్మాయి కూడా కనిపించకుండా పోతుంది. దీంతో ఆత్మలు ఉన్నాయనే ప్రచారంతో ఆ కాలేజీ పేరు దెబ్బ తింటున్న స్థితిలో యాజమాన్యం.. ఆత్మల గురించి శాస్త్రీయ పద్ధతిలో పరిశోధన జరిపే ఘోస్ట్ ఇన్వెస్టిగేటర్ వ్యోమ వైద్యలింగం (ఆది పినిశెట్టి)ను కాలేజీకి రప్పిస్తుంది. కాలేజీలో ఆత్మలేవీ లేవని అతడితో నిర్ధారింపజేయాలన్నది కాలేజీ పెద్దల ప్లాన్. ఐతే వ్యోమ కళాశాలలో అనుమానాస్పద విషయాలను గమనిస్తాడు. కనిపించకుండా పోయిన మూడో అమ్మాయి కూడా ఆత్మహత్య చేసుకోవడంతో కాలేజీలో ఆత్మలున్నాయనే అతడి అనుమానం బలపడుతుంది. దీంతో తనదైన శైలిలో ఆత్మల ఉనికిని కనిపెట్టడానికి ప్రణాళిక రచిస్తాడు. మరి అతను అనుకున్నట్లే అక్కడ ఆత్మలున్నాయా.. ఉంటే ఎన్ని ఉన్నాయి.. వాటి గతమేంటి.. ఈ మరణాల వెనుక మిస్టరీ ఏంటి.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**కథనం-విశ్లేషణ:** ఇండియన్ ఫిలిం హిస్టరీలో ఎన్నో హార్రర్ సినిమాలు వచ్చాయి కానీ.. వాటిలో ఈరం (తెలుగులో వైశాలి) చాలా స్పెషల్. ఆత్మ ఒక వాహకాన్ని ఎంచుకుని దాని ద్వారా తన ఉనికిని చాటుకోవడం.. తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం అనే పాయింటు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురి చేయడమే కాక.. ఆ ఐడియాను ఎగ్జిక్యూట్ చేసిన తీరు అబ్బురపరిచింది. ఈ చిత్రంతో దర్శకుడిగా తన ఆగమనాన్ని శంకర్ శిష్యుడైన అరివళగన్ ఘనంగా చాటిచెప్పాడు. ఆ తర్వాత కూడా అతను కొన్ని వైవిధ్యమైన సినిమాలు తీశాడు. ఇప్పుడతను 'వైశాలి'లో హీరోగా నటించిన ఆది పినిశెట్టినే పెట్టి తీసిన సినిమా.. శబ్దం. ఆది-అరివళగన్ కాంబో అనగానే 'వైశాలి' గుర్తొచ్చినట్లే.. ఈ సినిమా కాన్సెప్ట్ చూసినా 'వైశాలి'ని గుర్తు తెస్తుంది. అక్కడ వాహకం 'నీరు' అయితే.. ఇక్కడ 'శబ్దం' సోర్స్ అయింది. ఐతే అక్కడ 'నీరు' మ్యాజిక్ చేసినట్లుగా.. ఇక్కడ 'శబ్దం' మాత్రం ప్రేక్షకులను అనుకున్నంతగా ఎంగేజ్ చేయలేకపోయింది. ఇందులో కూడా ఐడియా ఎగ్జైటింగ్ గా అనిపించినా.. దాన్ని ఎగ్జిక్యూట్ చేసిన తీరు మాత్రం అనుకున్నంత ఆసక్తికరంగా అనిపించదు. కన్విన్సింగ్ గా అనిపించని.. అసహజంగా అనిపించే సన్నివేశాల వల్ల 'శబ్దం' ఇంపాక్ట్ తగ్గిపోయింది. కాన్సెప్ట్.. కొన్ని క్రేజీ సీన్ల కోసం 'శబ్దం'ను ఒకసారి ట్రై చేయొచ్చు కానీ.. 'వైశాలి' లాంటి ప్రత్యేకమైన అనుభూతి మాత్రం ఇది అందించదు. ఎప్పుడూ చూడని ఒక ఐడియాను తెర మీద తొలిసారి చూసినపుడు కలిగే అనుభూతే వేరు. 'వైశాలి' సినిమాలో కథానాయిక ఆత్మ నీటిని వాహకంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకోవడం అనే పాయింట్.. అలాంటి అనుభూతినే కలిగించింది. ఐతే ఐతే 'శబ్దం' సినిమా చూస్తుంటే 'వైశాలి' ఐడియాను రిపీట్ చేస్తున్న ఫీలింగ్ కలగడం వల్ల అందులో ఉన్న సర్ప్రైజ్ ఫ్యాక్టర్ ఇక్కడ కొరవడింది. 'వైశాలి' అనే సినిమా లేకపోయి ఉంటే.. శబ్దాన్ని వాహకంగా చేసుకుని ఆత్మలు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం అనే పాయింట్ చాలా క్రేజీగా అనిపించి ప్రేక్షకులు ఆశ్చర్యపోయే అవకాశం ఉండేది. 'వైశాలి'తో పోలిక సంగతి పక్కన పెడితే.. 'సౌండ్' కాన్సెప్ట్ కొంతమేర ప్రేక్షకుల్లో ఒక క్యూరియాసిటీ కలిగిస్తుంది. ఘోస్ట్ ఇన్వెస్టిగేటర్ గా హీరో పాత్ర పరిచయం.. అనుమానాస్పద మరణాలను ఛేదించే దిశగా తనకు ఎదురయ్యే టాస్క్.. దాన్ని ఛేదించే క్రమంలో హీరో వేసే ఎత్తుగడలు.. ఇవన్నీ కూడా ఆసక్తికరంగా అనిపిస్తాయి. మున్నార్ నేపథ్యాన్ని ఎంచుకుని ఒక వైవిధ్యమైన థ్రిల్లర్ చూస్తున్న మూడ్ సెట్ చేయడంలో కూడా దర్శకుడు విజయవంతం అయ్యాడు. కాలేజీ లైబ్రరీలోని ఆత్మలను హీరో కనిపెట్టే ఎపిసోడ్ 'శబ్ధం'లో స్టాండౌట్ గా నిలుస్తుంది. తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తూ.. షాక్ కు గురి చేసే ఈ ఎపిసోడ్ తర్వాత.. ఆత్మల వెనుక మిస్టరీకి సంబంధించిన స్టోరీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తాం. ఐతే 'శబ్దం' సినిమాకు ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ పెద్ద మైనస్ అయింది. ఆత్మల వెనుక కథ శిరోభారంగా అనిపిస్తుందే తప్ప.. అందులో ఎమోషన్ రాబట్టలేకపోయాడు దర్శకుడు. సౌండుతో ముడిపెట్టి మ్యూజిక్ థెరపీ.. స్కామ్.. అంటూ దర్శకుడు ఏదేదో చూపించాడు కానీ.. అదంతా కూడా చాలా అసహజంగా అనిపిస్తుంది. ఇటు ఎమోషన్ వర్కవుట్ కాక.. అటు కాన్సెప్ట్ కన్విన్సింగ్ గా అనిపించక ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అంతా మిస్ ఫైర్ అయిపోయింది. ఏవేవో థియరీల గురించి దర్శకుడు చెప్పాలని చూశాడు కానీ.. అవి కన్విన్సింగ్ గా.. అర్థవంతంగా.. ఆసక్తికరంగా తెరపై ప్రెజెంట్ చేయలేకపోయాడు. ఫ్లాష్ బ్యాక్ మొదలైన దగ్గర్నుంచి గాడి తప్పే 'శబ్దం'.. ఆ తర్వాత ఏ దశలోనూ ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయింది. కథలో ట్విస్టులకు లోటు లేకపోయినా.. అవి వావ్ అనిపించేలా మాత్రం లేవు. సౌండ్ కాన్సెప్ట్ పక్కన పెడితే.. ఆత్మల వల్ల సమస్య మొదలవడం.. తర్వాత ఆ ఆత్మల కథ తెలియడం.. చివరికి అవి ప్రతీకారాన్ని పూర్తి చేయడం.. ఇందులో ఇలా ఔట్ లైన్ మాత్రం సగటు హార్రర్ చిత్రాల టెంప్లేట్లోనే నడుస్తుంది. ఓవరాల్ గా చెప్పాలంటే.. 'శబ్దం'లో కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. కొన్ని ఎపిసోడ్లు బాగున్నాయి. కానీ పూర్తి సినిమాగా ఇది సంతృప్తినివ్వలేకపోయింది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- విద్యా వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com